గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# మార్చి 2015
# కథలు




పెళ్ళి బాజాలూ బాగా మ్రోగుతున్నాయి. ముహూర్తం దగ్గర పడింది. అతిధులంతా వచ్చి కుర్చీలన్నీ ఆక్ర మించారు. అందిస్తున్న కాఫీ గ్లాసులు అందుకుని త్రాగుతూ పెళ్ళి మంటపం వైపు చూస్తూ మెల్లిగా కబుర్లాడుకోసాగారు. నేనూ నాపక్కనే ఉన్న ఉమ చెవిలో, "చూడవే ! మంటపానికి దగ్గరగా నిల్చు నున్నా విడ చీర? చాలా పాతగా లేదూ! చీప్ క్వాలిటీ అనుకుంటా, ఐనా పెళ్ళికలావస్తారేంటే ఎవరైనా?" అంటూ కఫీ సిప్ చేయసాగాను.

" ఔనుసుమా ! ఐనా ఆవిడ అంత నల్లగా ఉందేంటే! అంటు కుంటే అతు క్కుంటుందేమో అన్నట్లుంది బొగ్గు మసి, అలాంటి వాళ్ళ మనసూ మహా గట్టిగా కట్టెపేడులా , కంకర్రాయిలా ఉంటుంద నుకుంటా. " తుసుక్కున నవ్వింది ఉమ .

"అలా దగ్గరగా, పెళ్ళిపెద్దలా నిల్చోక పోతే మనలా వచ్చి కూర్చో వచ్చుగా!"

"కొందరం తేనే! అన్నీ పూసు కుంటారు, ఫోటోల్లో పడతా మనేమో!"

" ఈవిడ ఫోటోల్లో పడితేకానీ పెళ్ళి జంటకు కళ రాదను కుంటున్న దేమోనే!"

" ఆపక్కనే ఉన్నావిడ్ని చూడూ! ఎంత మంచి రంగో ! అచ్చం బంగారం! మనం కూడా అంత రంగులో లేము. అసూయగా ఉందే! పెళ్ళికొడుకు దగ్గరి బంధువై ఉంటుంది. బహుశా అతగాడి అక్కేమో!"

"ఔను సుమా లేక పోతే అలా స్టేజ్ మీద ఉండదుగా!"

"ఆ చీరకూడా చూడూ ఆమె వంటి రంగుకు బాగా అతికింది. గంధం కలర్!"

"మెడలో నెక్లెస్ చూడవే ! కొత్త డిజైన్ కదూ! ఆ రాళ్ళు ఎంత బాగున్నాయో! నవరత్నాల నెక్లెస్ "

" మా ఆయనా ఉన్నారెందుకూ! ఎంతోకాలంగా అడుగుతున్నా నవరత్నాల నెక్లెస్ చేయించమని. ఊ లేదు ఉప్పురాయీ లేదు.
"" అటుచూడూ ! ఆపళ్ళెం అందిస్తున్న ఆమె జెడ ఎంత పెద్ద దో !"

"ఔనే ! నాకూ చిన్నప్పుడు అంత పెద్ద తలకట్టు ఉండేది. నగర నాగరి కతని మా ఆయన ఈ క్రాఫ్ పెట్టుకో మన్నాడు. నాముఖానికి ఈ బాబ్డ్ హేరే బావుంటుందిట!"

"ఆ పచ్చ పట్టు చీరావిడ ముక్కు బులాకీ చూడవే! ఎంత బావుందో వజ్రపు ముక్కుపుడకే! మెర్సి పోతోం దికదూ!"

" ఆ నల్ల లావుపాటావి డెందుకే అలా నిల్చుకుంది? అందరికీ అడ్డంగా? అదేనే ఇందాక మనం అనుకున్న చీప్ శారీ ఆవిడే! బహుశా వాళ్ళ పని మనిషై ఉంటుంది.అందుకే అలా చేతులు కట్టుకుని నిల్చునుంది , ఎవరే మైనా అడుగుతారేమోని."

" ఏమోనే ఆవిడ మాటిమాటికీ ఆ వజ్రాల నెక్లెస్ తో ఏదేదో చెప్తోంది , ఆవిడేమో అన్నింటికీ తలూపుతూంది కూడానూ. ఆనల్లా విడకు పెళ్ళిళ్ళు చూసిన అనుభవం ఉందేమోనే , అందుకే అన్నీ చెప్తున్నట్లుంది. ఆ వజ్రాల నెక్లెస్ బాగా చదువుకున్న దై ఉంటుంది అందుకే నే అంత సంస్కారం! ఏదో పెద్ద ఐటీ కంపెనీలో నెల కు ఐదారు లక్షల జాబ్ చేస్తూ ఉంటుంది. లేకపోతే అంత ఖరీదైన చీరా

నగలూ ఎలా వస్తాయీ! "

"ఇంతకూ పెళ్ళికొడుకు తల్లి తండ్రి ఏరే! "

"ఏమోనే ! మన మానస రానీ అడుగుదాం, ఐనా దీని కెందుకే అంత బిజీ! వాళ్ళ పెదనాన్న కూతురి పెళ్ళికి" "సరే కానీ పె ళ్ళికూతురెనకాల నిల్చున్నావిడ మెడలో ఆసన్న చైనేంటే ! అది వెండి చైనో లేక ఇమిటేషన్ వెండో ఐఉంటుంది. మరీ పేద రాలులా లేదూ! ఆ నేత చీరానూ ! వెళ్ళి వెనకెక్కడో కూర్చోక అలా నిల్చుందేమే! "

" చూడూ ! ఆ నల్ల కళ్ళద్దాల వాడు , పోజిస్తూ మనల్నే చూస్తున్నాడే! ఇలాంటి వెధవలు పోజులుకొట్ట నే వస్తారు పెళ్ళిళ్ళకు, పోయి నాలుగు వాయించి రానా!"

"వద్దు లేవే గొడవ లెందుకు? నీవు అందంగా నా జూగ్గా ఉన్నావుగా! అందుకే నల్ల అద్దాల్లోంచి తెగ చూస్తు న్నట్లున్నాడు. పెళ్ళి కాలేదను కుంటున్నాడేమో! మీ ఆయన వచ్చుంటే బావుండేది నాలు గంటిచ్చి వచ్చే వాడు. ఐనా నీవు పెళ్ళికాని పిల్లల్లే వయ్యారాలుపోతున్నావాయె ! ఎవరికైనా చూడాలని పిస్తుంది. ఖర్మ కాలి నేను ఆడపిల్లనై పోయాను కానీ లేక పోతేనా! " "ఛా పోవే నీవు మరీని! " ఇద్దరం నవ్వుకుంటుండగా మా నెచ్చెలి ,పెళ్ళికూతురు చెల్లి చిన్మయి వచ్చింది.

"ఏమే కూర్చున్నారా! విసుగేసి వెళ్ళి పోయారను కుని కంగారుపడి చచ్చాననుకో."

"ఔనే ! ఇద్దరమై పోయాం మానస కూడా కంటికి కనిపించనే లేదు."

"అది మా అక్కకు అలంకారం చేసి తన మేకప్ పాడై పోయిందని అలంకరించు కుంటోందిలే, వస్తుంది. ముహూర్తం ఐందంటే అంతా టిఫిన్స్ కెళతారు , మీరూ దొరకరు కదా! అందుకే సందు చూసుకుని వచ్చా." " బోరు కొట్టి చస్తున్నాం. ఇంతకీ స్టేజ్ మీ దున్న వాళ్ళంతా ఎవరెవరో చెప్పవే.."

"అందుకే గా వచ్చాను. చూడండీ ! అక్కడ పాత తరహా చీరలో ఉన్న లావుపాటి నల్లరంగులో ఉన్నావిడ కోటీశ్వరురాలు , కోమలమ్మ మనస్సు దొడ్డది. తన సొమ్ముతన కోసం ఏమీ ఖర్చుచేసు కోదు. అంతా పేద లకే! ఆచీర తన పెళ్ళినాటిదిట!

ఒళ్ళుకప్పుకోనేగా బట్టలు, దానికోసం ఖర్చెందుకూ అంటుంది. మా అక్క పెళ్ళికి ఖర్చంతా కోమలమ్మే పెట్టుకుంది, మనస్సు మనోహరం , చాలా మంచిది. ఎందరో పేద కన్యల వివాహాలకు, కులమతాలు చూడకుండా ఖర్చంతా పెడుతుంటుంది. మా నాన్న పెళ్ళి ఖర్చు కూడా పెట్టు కో లేకేగా ఇంత కాలం మా పెళ్ళిళ్ళు చేయలేంది. ఆస్టేజ్ మీదున్న గంధం రంగు చీర కట్టుకున్నది ఈమె సర్వెంట్! ఆచీర ఈమే కొనిచ్చింది. నగలన్నీ నకిలీవే! మా అక్క అదే , పెళ్ళి కూతురెన కాల నిల్చున్నా విడ పెళ్లి కొడుకు అక్క, అమెరికాలో మిలియనీర్!ఎంత సాదా సీదాగా ఉందో చూడూ! ఆపచ్చ పట్టుచీ రా విడ పురోహితుని భార్య ! ఆయనకు ఏదైనా అవసర మవుతుందేమోని నిల్చునుంది." చిన్మై ఆపకుండా చెప్తుండగా మా నోర్లు కాస్త కాస్త ఎండుతుండగా , ఉండబట్టలేక అడిగాను."ఆముక్కు పుడక రవ్వలదే కదూ!"

"నీముఖం ! అదీ నకిలీదే! "చిరునవ్వు నవ్వింది అందగా చిన్మై. ఆ అంటూ నోళ్ళు తెరిచాం ఇద్దరమూనూ!

"ఆ పెద్ద జడావిడ ఎవరే! ఏంత మంచి తలకట్టే! !"ఆశ్చర్యంగా ఉమ అడిగింది చిన్మై ని. చిన్మై పెద్దగా నవ్వి " అది మా బాబాయ్ కూతురు, రత్న! దానిది జుట్టుకాదు సవరమే! దానిదీ మీలాగే బాబ్డ్ హేర్!" మళ్ళీ ఉమ , నేను ఇద్దరం ముఖాలు చూసుకున్నాం. "ఇహ ఆ నల్లకళ్ల జోడు అతడు చూడండీ! చాలా నాజూగ్గా , మంచి రంగు లో లేడూ! అతడి మీద మీ అభి ప్రాయమేంటే!" అడిగింది చిన్మై." వట్టి రౌడీలా ఉన్నాడే! ఇందాకటి నుంచి మావైపే చూస్తున్నాడు." కోపంగా అంది ఉమ.

" అతడికి కంటి చూపు లేదే! చిన్నప్పుడు దీపావళి టపాసులు పడి చూపు పోయింది. ఐనా చూపు లేని వాళ్ళ భాష ' బ్రైలి 'లో డిగ్రీ , ఎంబి.ఏ చదివి, పీహెచ్ డీ చేసి , పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు . స్వంత కంపెని పెట్టుకున్నాడు. మా బావ అదే పెళ్ళికొడుకు అక్క అమెరికా తీసుకెళ్ళి ఆపరేషన్ చేయిస్తుందిట. ఇక్కడ కంటే అమెరికాలో అతడి కళ్ళకు ఆపరేషన్ చేసే మంచి డాక్టర్స్ ఉన్నారుట!.దీని కంతా ఖర్చు మా పాలిటి దేవత ఆ కోమలమ్మే పెడుతుందిట! దానికి ముందే మాపెళ్ళి జరుగుతుంది. అతడే నాక్కాబోయే భర్త! " అంది సిగ్గుపడుతూ చిన్మై.మా నోళ్ళు పడి పోయాయి. చిత్తరువుల్లా చూస్తూ ఉండి పోయాం .

చిన్నప్పుడు మా బామ్మ చెప్పినమాట గుర్తొచ్చింది.'మనిషిని చూడగానే ఒక అభిప్రాయం ఏర్పర్చుకోడం తప్పు ' అని. మా ' బరావళ్లు ' అదేమా 'అంచనా' అంతా తప్పైపోయింది కదా! మెరిసే దంతా మేలిమి కాదు , మెరవని దంతా మురికి కాదు అని అర్ధమై తలలు వంచుకున్నాం, మా మనస్సుల్లోని మురికిని చూసుకుంటూ.




"చేస్తావా? లేదా?!" బిగ్గరగా గద్దించింది వరలక్ష్మి.

"నాకు అలవాటు లేదు వరం..." ఇంకా గారాలు పోతున్నాడు బుచ్చిబాబు.

"నేను మాత్రం పుట్టగానే చేతిలో గరిటెతో పుట్టానా ఏంటి?!" అంతకంతకూ వరలక్ష్మి స్వరం పెద్దదవుతోంది.

"నీకు మీ అమ్మ నేర్పి ఉంటుంది వరాలూ! అయినా తను కూడా వంట అదరగొడుతుంది కదా!" కాకామార్గంలో పనవుతుందేమోనని ప్రయత్నించాడు బుచ్చిబాబు.

"చూడు బుచ్చి! నన్ను బుట్టలో వేసుకునే ప్రయత్నాలన్నీ మానుకుంటే మంచిది. పెళ్ళై మూడు నెలలు కావస్తోంది కానీ ఇప్పటి వరకూ పెళ్ళిచూపుల రోజు చేసిన ప్రామిస్ నిలబెట్టుకోలేదు. ఏదో నాకూ సెలవు ఉంది కాబట్టి, నువ్వూ సెలవు పెట్టావ్ కాబట్టి, అడపాదడపా వంటింట్లోకి వచ్చి సాయం చేస్తున్నావ్ కాబట్టి ఇన్నిరోజులూ ఏదో వండి పెట్టాను. రేపటినుండి మాత్రం స్టవ్ మీద నేను పెట్టే పప్పులుడకవ్! నీవు పెట్టాల్సిందే." అల్టిమేటం ఇచ్చింది వరలక్ష్మి.

"ఇప్పటికిప్పుడంటే చాలా కష్టం కదా వరం!" బ్రతిమాలుతూ గడ్డం పట్టుకోబోయాడు బుచ్చిబాబు.

"అలాంటపుడు పెళ్ళిచూపుల రోజే మీ గురించిన నగ్నసత్యాలు నాకు చెప్పేసి ఉండాలి కదా. మూణ్ణెల్ల కాపురం దాకా కూడా వచ్చి ఉండేది కాదు పరిస్థితి! గడ్డమే కాదు... కాళ్ళు పట్టుకున్నా సరే ముందు చెప్పిన మాటలే ఖాయం." ఖచ్చితంగా కత్తితో కోసినట్టు చెప్పింది వరలక్ష్మి."ఇంట్లో పని, వంట పని వచ్చా అని అడిగితే అవసరార్థం వచ్చని అబద్ధమాడాను కానీ ఆ పనులు రాకపోవడం కూడా నగ్నసత్యాలేనా వరం?!" జాలిగా అడిగాడు బుచ్చిబాబు.

"మరి కాక ఇంకేంటి? ఇది జీవితాలతో ముడిపడిన సమస్య బుచ్చి! రేపటినుండి నేనూ ఆఫీసుకెళ్ళాల్సినదాన్నే! ఇన్నిరోజులూ ఎలాగో పోనీలే అని వంటింట్లో కుస్తీలు పడ్డాను కానీ ఇక నా వల్ల కాదు."

"పోనీ వంట చేసేటపుడు నువ్ నా దగ్గరుంటావా?!" ఆశగా అడిగాడు.

"ఊహూ... ఉదయం పూట చెయ్యాల్సిన పనులు నాకూ చాలా ఉంటాయి. కుదరదు. కావాలంటే ఆ షెల్ఫ్ లో కొన్ని పుస్తకాలు ఉన్నాయి. అన్నీ వంటల పుస్తకాలే. చదివి ఒక్కో ఐటం ట్రై చేస్తూ ఉండు. అదే వచ్చేస్తుంది." సలహా పడేసింది వరలక్ష్మి.

"కుదరకపోతేనో?!" అనుమానంగా అడిగాడు బుచ్చిబాబు.

"వారం రోజులు చూస్తాను. ఆ తర్వాత కోర్టులో కేసేసేస్తాను." కోపంగా చెప్పింది వరలక్ష్మి.

"కోర్టులో కేసే?! విడాకులకా?!" బెదురుచూపులు చూస్తూ అడిగాడు బుచ్చిబాబు.

"కాదు ఫోర్ ట్వంటీ కేసు. చీటింగ్ చేసావని."

"వంట చెయ్యకపోవడం కూడా చీటింగ్ కేసే?!"

"మరి కాదా?! ఆ రోజు నువ్వు చేసి పెడతానన్న అన్ని పనులకూ అగ్రిమెంట్ తీసుకున్నాకేగా మా నాన్నకు తాంబూలాలు ఇచ్చుకోవచ్చని నేను గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది?!" దర్పంగా చెప్పింది వరలక్ష్మి.

"కానీ వరం, నేను కూడా ఉద్యోగం చెయ్యాలి కదా?!" అడగొచ్చో లేదో అన్నట్టుగా చూస్తూ అడిగాడు బుచ్చిబాబు.

"కానీలూ కాసులూ మూణ్ణెల్ల క్రితం చెప్పాలి. ఇప్పుడు కాదు! అయినా ఇంకొక్క నెలే గడువు ఉంది అని మన పెళ్ళై రెండు నెలలు దాటగానే నీకు చెప్పాను. అయినా నువ్వు ఏమీ కానట్టుగా నవ్వి ఊరుకునేవాడివి. అప్పుడు కూడా వంట రాదని మాత్రం చెప్పలేదు." కస్సుమంటూ భర్తను కసిరి దుప్పటి పైకి లాక్కుని మరో వైపు తిరిగి పడుకుంది వరలక్ష్మి.

బుచ్చిబాబుకేం చెయ్యాలో తోచడంలేదు. పెళ్ళిచూపుల రోజు వరలక్ష్మిని చూడగానే తెగ నచ్చెయ్యడంతో ఆ రోజు తనేం చెప్తే దానికి గంగిరెద్దులా తలాడించేశాడు. పైగా ఎక్కడ సంతకాలు పెట్టమంటే అక్కడ కరోడ్పతి ప్రోగ్రాంలో అమితాబ్ బచ్చన్లా చకచకా చెక్కి పడేశాడు.అప్పుడు ఊ అనేసి ఆ తర్వాత ఏదో నచ్చచెప్పొచ్చులే అనుకున్నాడు కానీ వరం మాటంటే శిలాశాసనమని పెళ్ళయిన నెలరోజులకే తెలిసిపోయింది తనకు. చిన్నప్పటినుండి మంచినీళ్ళ కోసం కూడా వంటింట్లోకి అడుగు పెట్టకుండా పెరిగిన తనకు ఇలాంటి భార్య దొరుకుతుందని కానీ, వంటకు కూడా వంతులవారీ పద్ధతి ఉంటుందని కానీ కలలో కూడా అనుకోలేదు!

ఆలోచిస్తూ అల్మరా వైపు నడిచి అక్కడ ఉన్న వంటల పుస్తకాలు తీశాడు బుచ్చిబాబు. కూర్చుని ఒక్కో పుస్తకాన్నీ చదవడం ప్రారంభించాడు.

***

"ఛీ! ఇది పప్పా?! కనీసం కుక్కలైనా ముట్టుకుంటాయా?!" గుడ్లురుముతూ ముఖమంతా వికారంగా పెట్టుకుని అడిగింది వరలక్ష్మి."మొదటిరోజు కదా వరం! రాత్రంతా కష్టపడి చదివి, తెల్లవారే మళ్ళీ పుస్తకాన్ని చదివి మరీ చేశాను. నాకూ కొత్త కదా, కొంచెం సర్దుకో వరం!" భార్యను అనునయించే ప్రయత్నం చేశాడు బుచ్చిబాబు.

"ఏంటి సర్దుకోవడం? నీ భయంకరమైన వంటతో మూడ్ ఆఫ్ చేశావ్!" చెయ్యి కడిగేసి చెప్పింది వరలక్ష్మి.

"అలా అంటే ఎలా వరాలూ! ఇవాళే కదా ఫస్ట్ టైం నేను వంట చేసింది! అందుకే సరిగ్గా కుదిరినట్టు లేదు. ఇంకేమైనా మోడిఫై చెయ్యాలంటే చెప్పు. చేస్తాను."

"బాబూ బుచ్చి... నీకో నమస్కారం. మధ్యాహ్నం మా క్యాంటీన్లో హాయిగా భోజనం చేసేస్తాను కానీ క్యారేజ్ కూడా సర్దకు." హుకుం జారీ చేసింది వరలక్ష్మి.

"సరే అలా పేచీలు పెట్టకు కానీ, రేపు చేసే వంటను బాగా చదివి నేర్చుకుంటాలే!" సర్దిచెప్పాడు బుచ్చిబాబు."మరి సాయంత్రం సంగతేంటి?!" బాణంలా ప్రశ్నను సంధించింది వరలక్ష్మి.

"సాయంత్రం ఆఫీస్ నుండి వచ్చి వండాలంటే నాకూ కష్టమే వరం!      కర్రీ పాయింట్ కెళ్ళి మంచి కూరలేవైనా తెస్తానులే."

"మళ్ళీ అదొక ఎగస్ట్రా ఖర్చా?!" కసిరింది వరలక్ష్మి.

"మరేం చేస్తాం చెప్పు? అయినా ఖర్చు పెట్టేది నేను కదా. నీ జీతంలోంచి ఇవ్వొద్దులే!" మనసులో కారాలు మిరియాలూ నూరుతూ, పైకి మాత్రం నవ్వుతూ చెప్పాడు బుచ్చిబాబు.

"సరే ఏదో ఒకటి చెయ్యి. ఏం చేస్తాం!" నిట్టూర్పు ఒకటి వదులుతూ దయతలచింది వరలక్ష్మి.

ఆ తర్వాతి రోజు కూడా అదే తంతు!

"చిక్కుడుకాయ కూర వండడం కూడా రాదా నీకు?! మా అమ్మైతే ఎంత బాగా వండేదో!" బాధగా చెప్పింది వరలక్ష్మి వంట రుచి చూస్తూ."మీ అమ్మ బ్రతికుండగా నువ్ ఆ చిక్కుడుకాయ కూర ఎలా చెయ్యాలో నేర్చుకుని ఉంటే బావుండేది వరాలూ! పాపం ఇప్పుడావిడ స్వర్గంలో దేవతలందరికీ చిక్కుడుకాయ కూర్చ వండి వడ్డిస్తూ ఉంటుందేమో!" బుచ్చిబాబు చెప్పాడు.

"వెటకారానికేమీ తక్కువ లేదు. కూరలో మాత్రం కారం ఎంత వెయ్యాలో కూడా తెలీదు." కోపంగా చెప్పింది వరలక్ష్మి.అలా మరో నాలుగు రోజులు గడిచాయి.

"ఏం కూర బుచ్చీ ఇది?" మొదటి ముద్ద నోట్లో పెట్టగానే వరలక్ష్మి ముఖంలో రంగులు మారాయి. గబగబా మంచినీళ్ళ గ్లాసందుకుని గటగటా మొత్తం తాగేసింది.

"దొండకాయ కూర వరం! ఉల్లికారం పెట్టాను." చెప్పాడు బుచ్చిబాబు.

"ఉల్లికారమా ఉత్త కారమా?! ఏంటీ వంట బుచ్చీ?!" కారం నషాళానికంటుకున్న ఉద్రేకంతో వరలక్ష్మి గొంతు ఇంటి పై కప్పును ఎగరగొట్టేస్తోంది."అలా అరిస్తే నేనేం చెయ్యగలను వరాలూ?! తిరుపతి హుండీలో వేసిన డబ్బుల్ని, కూరలో వేసిన కారాన్నీ మళ్ళీ వెనక్కి తియ్యలేం కదా?!"

"దరిద్రపు లాజిక్కులకేమీ తక్కువ లేదు. బుచ్చీ... రేపే ఆఖరి రోజు! రేపు కనుక కూర చక్కగా వండి పెట్టకపోయావో ఫోర్ ట్వంటీ కేసే నీ మీద! గుర్తుంచుకో!" వార్నింగ్ ఇచ్చి సగం అన్నాన్ని కంచంలోనే వదిలి లేచిపోయింది వరలక్ష్మి. అనుమానం వచ్చి వెనక్కు వచ్చింది వరలక్ష్మి. "అవునూ నువ్వు అన్నం తిన్నావా?!"

"ఈరోజు మంగళవారం కదా వరం! నేను ఉపవాసం." తడుముకోకుండా చెప్పాడు బుచ్చిబాబు, మనసులో ఆంజనేయస్వామికి క్షమాపణలు చెప్పుకుంటూ.

"సరే, గుర్తుంది కదా, రేపే ఆఖరి రోజు నీకు!" విసవిసా నడుస్తూ వెళ్ళింది వరలక్ష్మి.

'హమ్మయ్య సాయంత్రం రెండు ప్లేట్ల ఛాట్ తినేసి రావడం మంచిదయింది!' అనుకుంటూ హాయిగా నిట్టూర్చాడు బుచ్చిబాబు.తెల్లవారింది. వరలక్ష్మి స్నానం చేసి, పూజ ముగించుకుని, బెడ్రూంలో కూర్చుని పేపర్ చదువుకుంటోంది.

"గుడ్మార్నింగ్ వరం డార్లింగ్! ఇదిగో 'ఆనంద్ ' సినిమాలాంటి చక్కని కాఫీ!" నాటకీయంగా చెబుతూ కప్పును ఆమె ముందుంచాడు బుచ్చిబాబు.

"బుచ్చి, ఏంటి ఇవాళ ఇంత సువాసన వచ్చేస్తోంది కాఫీ?! ఉండు రుచి చూస్తాను." అంటూ కొంచెం త్రాగి ఆశ్చర్యంతో కనుబొమలెగరేసింది వరలక్ష్మి. "నువ్వే చేశావా?!" నమ్మశక్యం కానట్టుగా అడిగింది.

"ఇదొక్కటేనా? వంటింట్లోంచి వస్తోన్న జీడిపప్పు ఉప్మా వాసన రాలేదా?!" నవ్వుతూ అడిగాడు బుచ్చిబాబు.

"ఇందాకటినుండీ వస్తోంది కానీ పక్కింట్లోంచి అనుకున్నా బుచ్చి! ఒక్కరాత్రిలో నువ్వు వలలుడంత వంటకాడిగా మారిపోతావనుకోలేదు!! పద... ఉప్మా ఎలా వండుతున్నావో చూస్తాను!!" ఆశ్చర్యానందాలు కలగలసిన స్వరంతో చెప్పి వంటింటి వైపు దారి తీసింది వరలక్ష్మి.తెల్లవారింది. వరలక్ష్మి స్నానం చేసి, పూజ ముగించుకుని, బెడ్రూంలో కూర్చుని పేపర్ చదువుకుంటోంది."గుడ్మార్నింగ్ వరం డార్లింగ్! ఇదిగో 'ఆనంద్ ' సినిమాలాంటి చక్కని కాఫీ!" నాటకీయంగా చెబుతూ కప్పును ఆమె ముందుంచాడు బుచ్చిబాబు."బుచ్చి, ఏంటి ఇవాళ ఇంత సువాసన వచ్చేస్తోంది కాఫీ?! ఉండు రుచి చూస్తాను." అంటూ కొంచెం త్రాగి ఆశ్చర్యంతో కనుబొమలెగరేసింది వరలక్ష్మి. "నువ్వే చేశావా?!" నమ్మశక్యం కానట్టుగా అడిగింది.

"ఇదొక్కటేనా? వంటింట్లోంచి వస్తోన్న జీడిపప్పు ఉప్మా వాసన రాలేదా?!" నవ్వుతూ అడిగాడు బుచ్చిబాబు."ఇందాకటినుండీ వస్తోంది కానీ పక్కింట్లోంచి అనుకున్నా బుచ్చి! ఒక్కరాత్రిలో నువ్వు వలలుడంత వంటకాడిగా మారిపోతావనుకోలేదు!! పద... ఉప్మా ఎలా వండుతున్నావో చూస్తాను!!" ఆశ్చర్యానందాలు కలగలసిన స్వరంతో చెప్పి వంటింటి వైపు దారి తీసింది వరలక్ష్మి.

ఆమె వెనుకే తనూ వెళ్ళాడు బుచ్చిబాబు. వంటింట్లో కనిపించిన దృశ్యం చూసి కొయ్యబారిపోయింది వరలక్ష్మి."కంగారు పడకు వరం! తను వనిత అని మనకు సాయంగా ఇవాళే పనిలో చేరిన వంటమనిషి! ఇంటిపనులు కూడా చాలా బాగా చేస్తుంది." పరిచయం చేశాడు బుచ్చిబాబు.

"నమస్తే అండీ!" రెండు చేతులూ జోడించింది వనిత. సాటి స్త్రీ అయినా కాసేపు కళ్ళు తిప్పుకోకుండా ఆమె వైపే వరలక్ష్మి చూస్తూ ఉండిపోయిన అందం ఆమెది! "నమస్తే. ఇంక నేను చూసుకుంటాను కానీ నువ్వు వెళ్ళిపోమ్మా. అవసరమైతే అయ్యగారు నీకు కబురు పంపిస్తారులే!" అని చెప్పి వనితను పంపించేసింది వరలక్ష్మి.

ఆమె వెళ్ళిపోగానే తేరుకుని బుచ్చిబాబ్ మీద గయ్యిమంటూ అరిచింది వరలక్ష్మి. "వంటమనిషిని పెట్టమని నేను చెప్పానా?!""కానీ ఇవాళే ఆఖరి రోజని, వంటలు రుచిగా లేకపోతే నా మీద ఫోర్ ట్వంటీ కేసు పెడతానని చెప్పావ్ కదా... అందుకని..." నసిగాడు

బుచ్చిబాబు."అందుకని వంటమనిషిని పెట్టేసుకుంటావా?! అదీ అంత అందమైన అమ్మాయిని!" వరలక్ష్మి కళ్ళు నిప్పులు కురిపిస్తున్నాయి.భార్య చెప్పిన రెండో వాక్యానికి ఉప్పొంగిపోయాడు బుచ్చిబాబు. మనసులో నవ్వుకుంటూ, "ఏమయింది వరం?! రాత్రి ఏడున్నర వరకూ పని చేసొచ్చే నీకు ఉదయాన్నే లేచి వండుకునే ఓపిక లేదు. నాకేమో వండడం రాదు. చూశావుగా నా కూరలన్నీ ఎంత చెత్తగా ఉంటున్నాయో?! అందుకే వంటమనిషిని పెట్టుకుంటే ఎలాంటి సమస్యా ఉండదని ఇలా చేశాను. నువ్వలా తనను పంపించేస్తావనుకోలేదు." చెప్పాడు బుచ్చిబాబు.

వంటమనుషుల్లో 'వనిత ' తీరు వేరయా అన్నట్టున్న ఆమెను గురించే ఆలోచిస్తోంది వరలక్ష్మి. అంత అందంగా ఉన్న అమ్మాయిని వంటమనిషిగా పెట్టుకున్నాక భర్త ఆమెతో వెధవ్వేషాలు వెయ్యడన్న నమ్మకం తనకెంత మాత్రమూ లేదు!

తాననుకుంటున్నది ముఖంలో కనపడనివ్వకుండా జాగ్రత్త పడుతూ, "వంటమనిషి జీతం నువ్వే ఇచ్చినా సరే, పోయేది మాత్రం మన ఇంట్లోంచే కదా! కాబట్టి మనకు వంటమనిషి అవసరం లేదు."

"కానీ నా వంటలు రుచి చూస్తున్నావ్ కదా!"

"అవుననుకో. నీకు సరిగ్గా వంట చెయ్యడం రావడంలేదు కాబట్టి ఇంకొన్నాళ్ళు నేనే చేస్తాను. ఈలోపుగా నా దగ్గర బాగా నేర్చుకో." చెప్పింది వరలక్ష్మి.

"సరే. నీ ఇష్టం మరి!" ఆనందంగా చెప్పాడు బుచ్చిబాబు, వంటమనిషిగా నటించేందుకు తన చెల్లెలు వనితను పంపిన తన కొలీగ్ కు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ!!

కానీ మరో ఆరునెలలకు కథ మారింది! బుచ్చిబాబుకు వంటొచ్చేసింది! మళ్ళీ అతని చేతికే గరిటొచ్చేసింది!!ఎందుకంటే... వరలక్ష్మి ఆఫీసులో పనిచేసే భాస్కర్ పెళ్ళాడిన అమ్మాయి 'వనితే!'




రాత్రి కాస్త నిద్ర తగ్గిందేమో విశ్వానికి ఆఫీసులో కూర్చోవాలంటే ఏడుపు తన్నుకొస్తోంది.బడి వదలడానికి సూచనగా గంటకొట్టే సంచి భుజానవేసుకుని ఇంటికి పరుగెత్తాలనుకునే పిల్లాడి మనసైపోయింది.ఆఫీసు గడియారం వైపు పదే పదే చూస్తున్నాడు.

“ ఏం సినిమాకు వెళ్లాలా?”ఆ రోజు కొత్త సినిమాలు విడుదలయే రోజు కావడంతో సరదాగా అడిగాడు ప్రక్క సీటులోని రాకేష్.

“కాదు తండ్రీ! ఇంటికెళ్లి నిద్రపోవాలి.”ఆవలిస్తూ చెప్పాడు.

“అదేమిటి,మేము చేసే పని తినేసి పడుకోవడమే కదా!నువ్వేమయినా పహరా కాస్తున్నావా?” దొంగల భయానికి కాలనీలలో ,అపార్ట్ మెంట్లలో వంతులేసుకుని ఎవరైనా ఊరెళ్లి వచ్చేదాకా కాపలా కాస్తారు.విశ్వం ఉండే అపార్ట్ మెంట్ విధివిధానాలు తెలిసిన వాడు రాకేష్. అందుకే అనుమానంగా అడిగాడు.

“అదేం లేదు.” కంప్యూటరు షట్ డౌన్ చేస్తూ,రాత్రి జరిగిన ఉదంతం గుర్తుకొచ్చిన విశ్వానికి నవ్వులు మొగ్గలేసాయి.

“చెప్పి నవ్వరాదా నేను ఆనందిస్తా నీతోపాటు!” టేబిల్ సర్ది ఆ వేళకిక పనికి సెలవు ప్రకటించేసాడు రాకేష్.

“ ఏం లేదు రాకేష్, కిటికీలో చెయ్యి గుర్తుకొచ్చింది.”

ఉలిక్కిపడ్డాడు రాకేష్. ఏదో హారర్ మూవీ చూసొచ్చినట్లున్నాడు, అందుకే కాబోలు ఈ ఆవలింతల పర్వం. విశ్వం చెప్పబోయే కథనానికి ఆసక్తిగా ముందుకు వంగాడు.

“ రాత్రి నిద్ర పట్టక రూఫ్ మీద పచార్లు చేస్తున్నాను.వెలుగు, చీకటుల సమ్మేళనం కష్ట సుఖాలను ఏక కాలంలో ఏకరువు పెడ్తున్నట్టుగా ఉంది వాతావరణం. చల్లనిగాలి వీయడం మొదలయింది. అమ్మయ్య ,ఎండ కాలంలో ఎ.సి.లు లేని బడుగు జీవులకు చల్లని గాలి ప్రకృతి అందించే వరమే.” చల్లని గాలి అందించిన అనుభూతిని వివరిస్తున్నాడు విశ్వం.

“ వర్ణనలు సరే, సీరియల్ గా చెప్పేటట్టున్నావ్ ఇలా అయితే.”రాకేష్ లో చిన్న పిల్లాడిలా ఆతృత!

“ టూకీగానే చెప్తాను విను.”

“ఊ...కానీ...”రాకేష్ మరింత దగ్గరగా జరిగాడు.

“అలా తిరుగుతున్నానా, మెల్లగా నిద్ర కమ్ముకొస్తోంది.నిద్రకు మరింత జోలలా గాలి ఊపుతున్నట్లుగా ఉంది.

అంతలో ఎవరో కీచు గొంతుతో పిలిచిన భావన!”

“కీచురాళ్లేమో.”ఠక్కున అన్నాడు రాకేష్.

“అబ్బ కాదు గురూ, ఆ గొంతులో భయం ఉంది. పిలుస్తున్నట్టుగా ఉంది. నేను తొలుత భయపడ్డా, ఏమిటోననుకున్నాను. మెల్లగా చుట్టు పరికించాను. ఆ...అప్పుడు కనబడింది.” తన కథనం లోని ఉత్కంఠ రాకేష్ ముఖంలో ఎలా ప్రతిఫలిస్తుందో చూడాలని ఆగాడు విశ్వం

“ఏమిటి కనబడింది?”గాభరాగా అడిగాడు రాకేష్.

“కిటికీ లో చెయ్యి!”

“చెయ్యా?”

“ఆ...అవును చెయ్యే. రమ్మంటున్నట్టు, వేళ్లు ముడుస్తూ సైగలు.”

“కిటికీలో చెయ్యా? ఏ దొంగ వెధవో ఇంటిలోకి దూరాక, బయట పడే మార్గం లేక, ఎలా తప్పించుకోవాలా అని చూస్తున్నాడేమో!”“

నీ ఊహలు మాని విను. ఆ చెయ్యి మా ప్రక్క అపార్ట్ మెంట్ లో నుండి మా ఇంటికి నేరుగా కనిపిస్తోంది. గబగబా లిఫ్ట్ దగ్గరకు పరిగెట్టి క్రిందకు దిగాను. ప్రక్క అపార్ట్ మెంట్ వాచ్ మాన్ ను అడిగా, ఏమిటో ఎవరో మీ పైన ఫ్లాట్ లో చేతులూపుతున్నారని.”

“ఎవరూపుతారు సార్,ఏ దోమలో ఏవో దులుపుతుంటారు.” వాడినీ నిద్ర పిలుస్తున్నట్లే ఉంది.

“ కాస్త పైకి చూస్తావా?”గట్టిగా అనేసరికి వాడు పైకి చూసి, అమ్మో కిటికీలో చెయ్యి, తాతయ్యగారి స్నానాల గది అది.

“రండి సార్ చూద్దాం.”గాభరా పడ్డాడు. పరుగు లాంటి నడకతో వాడిననుసరించాను.

“షార్ట్ ఫిల్మ్ తీద్దామా?” సినిమా చూపిత్త మామ అంటున్న మనసును అదుపు చేసుకోలేక అడిగేసాడు రాకేష్.

“పాపం పెద్దాయన బాత్రూంలో చిక్కుకు పోతే నీకు సినిమా తీయాలనుందా!”

“ఏం బోల్ట్ పడిపోయిందా? అయ్యో ఈ కొత్త రకాల గడియలు మనకు సరిపోవు కాని అవే పెట్టున్నారు” అమెరికాలోని తలుపులు గుర్తుకు తెచ్చుకున్నాడు రాకేష్.

“పడిపోలేదు నాయనా వేసేసారు.”

“అదేంటి పనిష్మెంట్ లా!” రాకేష్ ముఖంలో అనుమానపు ప్రశ్నలు.

“ ఏంలేదు,ఆయన గదిలో ఎ.సి. పని చేయకపోతే టెక్నీషియన్ ను పిలిపించింది కోడలు. అంతవరకు ఎ.సి. టెక్నీషియన్ వెనకే తిరిగిన పెద్దాయన ‘ఇప్పుడే వస్తా నీ పని చేసుకో ’ అన్నాడు.

“అయిపోయింది సార్ రెండే నిమిషాలు.” అంటూ పని పూర్తి చేయసాగాడు.

“ఎ.సి. రిపేరు పూర్తయాక స్విచ్ వేసాడు.దాంతోపాటు కూలింగ్ పోతుందని కిటికీలు వేసేసాడు.బాత్రూం తలుపు వేసి ఉంది కాని, దాన్ని ఆనుకుని ఉన్న డ్రెసింగ్ రూం తలుపు తీసే ఉంటే కూలింగ్ సరిగా కాదని తలుపు దగ్గరగా లాగి గడియ పెట్టేసి , బయటకు హాల్లోకి వచ్చాడు. అప్పటికే పొద్దు దాటులోంది.గది నుండి బయటకు వచ్చిన పెద్దాయన కోడలు,’సార్ వచ్చాక కూలింగ్ చూసి డబ్బులిస్తారు, ఇదిగో’ అంటూ చాయ్ పైసలిచ్చి పంపేసింది.

చాయ్ పేరు వింటూనే ‘తరువాత ఏమైందంటూ?’ విశ్వాన్నడుగుతూ, ఆఫీసు కుర్రాడిని పిలిచి చాయ్ తెమ్మని డబ్బులిచ్చాడు రాకేష్.“ ఏముంది? ఎ.సి. వేసి ఉంటే మామగారు కాసేపు పడుకుంటారేమో అనుకుని చప్పుడు చెయ్యకుండా కూచుంది. ఆయన భోజనం, కొడుకు వచ్చే లోపలే ఏడుగంటలకే పూర్తయిపోయింది, పడుకోనీలే పాపం అనుకుంది కాని ఆ ఎ.సి. కుర్రాడు బాత్రూలోకి వెళ్లిన మనిషి బయటకు రాలేకుండా డ్రెసింగ్ రూం బయట గడియ వేసేసాడని ఊహించలేక పోయింది. ఫ్లాట్లన్నాక ఏవో అరుపులు, చప్పట్లు ఉండనే ఉంటాయి.వాటి నడుమ అరచి అరచి గొంతే కీచురాయిగా మారింది పెద్దాయనకు.”

కదలకుండా, మరో మాట లేకుండా వింటున్నాడు, రాకేష్.. కాదు కాదు.. ఆఫీసులో అందరు.

“ కాలింగ్ బెల్లుతోనే కాదు,తలుపు బాది మరీ ఆమెను పిలిచాం. ఆమె తలుపు తీయడం ఆలస్యం పరిస్థితి వివరించి పెద్దాయనను లోపలినుంచి దాదాపు ఎత్తుకొచ్చాము.ఆయన కిటికీలో ఊపిన చెయ్యి తలచుకుంటుంటే ఇప్పుడు నవ్వు వస్తోంది కాని గాభరా పడ్డ ఆయనకేదైనా అయుంటే అని తలచుకుంటే భయమేస్తుంది.నిజమే చిన్న అజాగ్రత్తలే పీకల మీద కత్తులవుతాయి.ప్రతి సంఘటనా బ్రతుకు పాఠమే కదా. చాలాసేపు మాటల్లో పడ్డాము.అజాగ్రత్తలు జాగ్రత్తలు మా చర్చాంశం అయింది.దాంతో నిన్న రాత్రి నిద్ర కాస్త కరువై ,.. ఆఆ ....”ఆవలిస్తూ లేచాడు విశ్వం.

నమస్కారానికి ప్రతి నమస్కారంలా విశ్వం ఆవులింతకు ప్రతిస్పందనగా తను ఆవలించబోయి చేయడ్డం పెట్టుకుంటూ గలగలా నవ్వేసాడు రాకేష్.




టైం చూసుకుంటూ హడావుడి పడిపోతున్న సుమతిని చూసుకుంటూ ఆనందంతో బాటు బోల్డంత ఆశ్చర్యంతో ఉబ్బితబ్బిబయింది వసుమతి. ఎప్పుడూ చుడీదారుల్లో కనిపించే కూతురు మల్లెపూవు లాంటి ఖద్దరు చీరా జాకెటుతో దర్శనమిచ్చే సరికి కళ్లలో నిండిన ఆనంద భాష్పాలతో తృప్తిగా కళ్లు మూసుకుంది ఓ క్షణం. తండ్రి లేని సుమతిని క్రమశిక్షణతో పెంచి పెద్దచేసింది. బాధ్యతలు గుర్తించిన సుమతి పోష్టుగ్రాడ్యుయేట్టై ఒక పెద్ద కంపెనీలో మేనేజరుగా ఉద్యోగం

చేస్తోంది.కానీ సేవాదృక్పధం వున్న ఉద్యోగం చేయాలన్న తన చిరకాల కోరిక తీర్చుకోవాలని తపన పడుతోంది. దాని పర్యవసానమే ఈ హడావుడి.

అమ్మాసుమా యింకా చాలా టైముందిరా. ముందు నువ్వు టిఫిన్ చేసెయ్ హడావుడి పడిపోతున్న తల్లిని మురిపెంగా చూస్తూ ..అయిందనిపించి బైచెప్పి బయలుదేరి పోయింది సుమతి ఇంటర్వ్యూకు. ఫోన్లో చెప్పిన కొండగుర్తుల్ని నెమరేసుకుంటూ మదర్ థెరిసా సేవాసదన్ మార్గసూచి దగ్గర ఆగిపోయి మరోసారి టైం చూసుకుంది. మరో అరగంట టైముంది.తన స్కూటీని సేవాసదన్ రోడ్ మీదకు మళ్ళించింద జస్ట్ మరో ఐదు కిలోమీటర్లు.లకీగా సేవాసదన్ మేనేజరుగా తను సెలక్ట్ అయితే తన జీవితాశయం నెరవేరినట్లే...వూహల్లో తేలిపోతూ తన స్కూటీ వేగం పెంచింది.రోడ్ ఖాళీగా వుంది . అప్పుడప్పుడు సేవాసదన్ నుండి వస్తున్న ఆటోలు తప్పనిర్మానుష్యంగా వుంది. హుషారుగా దూసుకు పోతున్న సుమతి హఠాత్తుగా తన స్కూటీని ఆపేసింది. రోడ్ ప్రక్క ఓచేతిలో సంచి,మరోచేతిలో వాకింగ్ స్టిక్ తో వెళ్తున్న వ్యక్తి హఠాత్తుగా కుప్పకూలి పోతుంటే ...ఒక్క గెంతులోవెళ్లి పడిపోకుండా పట్టుకుంది. సారీఅమ్మా..కళ్లు తిరిగి పోతున్నాయ్.. సారీ తల్లీ.. అంటున్న ఆపెద్దాయన్ని భద్రంగా తీసుకెళ్లి ఓతూమ్మీద కూర్చోబెట్టి తన బేగ్ లోంచి వాటర్ బాటిల్ తీసి అందించింది. వాటర్ తాగుతూ ఓప్రక్కకు వాలిపోతున్న ఆయన్ని పట్టుకొని ఓ ఖాళీఆటో ఆపి డ్రైవర్ సాయంతో ఆటోలో చేర్చితన స్కూటీని లాక్ చేసి మెయిన్ రోడ్ మీదున్న హాస్పిటల్లో తన కంపెనీ ఐడి కార్డు చూపించి తన చేతి బంగారుగాజును డిపాజిట్ చేసి అడ్మిట్ చేసింది. హఠాత్తుగా తన ఇంటర్వ్యూ సంగతి గుర్తొచ్చిటైం చూసుకుంది. అప్పటికే షెడ్యూల్ దాటి గంట గడిచిపోయింది.ఇంటర్వ్యూగురించి మనసు పాడుచేసుకోకుండా తన స్కూటీ గురించి ఆలోచిస్తూ రిసెప్షన్ముందు కూర్చుండిపోయింది.

కంగ్రాట్స్ తల్లీ..హిఈజ్ ఔటాఫ్ డేంజర్..ఆయనెవరో తెలియకపోయినా యింత రిస్క్ తీసుకున్నావు. వాళ్లబ్బాయి వచ్చాడు. ఇదిగో నువ్వు డిపాజిట్ చేసిన నీ బంగారు గాజు.వెల్డన్ ... కీపిటప్... ఆశ్చర్యంతో చూస్తున్న సుమతి భుజం తట్టి చిరునవ్వు నవ్వాడు డాక్టర్...

మూడీగా యింటికొచ్చిన కూతుర్ని చూస్తూ...మళ్లీ యిది ఏ దెబ్బతిన్న కుక్క పిల్లకో అడుక్కుంటున్న ఏ అవ్వకో సాయం చేయబోయి ఈ ఇంటర్వ్యూను కూడా తన్నేసుకుని వుంటుందిది...మామూలేగా దీనికి అని.. సమాధాన పడింది వసుమతి.

ఉదయం నిద్రలేస్తూనే ... అమ్మా..నేను సెలక్టయ్యాను...హౌ.. అంటూ అరిచేస్తున్న కూతుర్ని అయోమయంగా చూసింది వసుమతి.... అమ్మా ఇట్స్ ట్రూ...సీ మై యస్సైమ్మెన్స్... బట్.. ఐథింక్.. దేరీజెమిస్టేక్... విత్ఔట్ ఇంటర్వ్యూ...దట్ టూ...జనరల్ మేనేజర్ ...'ఒక్కసారి ఆశ్రమానికి వెళ్లి ఎంక్వైరీ చేసుకుంటాను. తయారై తుర్రుమంది సుమతి.

..తను హాస్పిటల్లో జాయిన్ చేసింది .. సేవా సదన్ ఫౌండర్ని.. తన ఇంటర్వ్యూ దారి లోనే పూర్తయిపోయిందనీ తెలిసే అవకాశం ..సుమతికి..      లేదు ...లేదు. .రాదేమో      కూడా.




టక్.. టక్.. టక్...

తలుపు చప్పుడయ్యింది. మంచి నిద్రలో ఉన్న శార్వరి ఉలిక్కిపడి లేచాడు.

మళ్లీ తలుపుకొట్టిన చప్పుడు.

'ఇంకా పూర్తిగా తెల్లారలేదు. ఈ సమయంలో వచ్చిన వాళ్లెవరబ్బా'...

కళ్లు నలుపుకుంటూ వచ్చి తలుపు తీశాడు.

ఎదురుగా నలుగురు వ్యక్తులు.

జీన్స్ ప్యాంటు, పైన చారల టీషర్టులు ధరించి ఉన్నారు. వాళ్ల చేతుల్లో బ్రీఫ్ కేసులు.

' సీ...బీ..ఐ...' అన్నారు కోరస్ గా.

శార్వరికి మత్తు దిగిపోయింది.

"ఈ మధ్య సీబీఐ గురించి చాలా సార్లు విని ఉన్నాడు. మంత్రులు, ఎమ్మెల్యేలే కాదు.

ఐ ఎ ఎస్ లు కూడా వీళ్ల దెబ్బకి జైలు ఊచలు లెక్కపెడుతున్నారు.

వీళ్ల చూపు నా మీద పడిందేమిటి? "

" మేము లోపలకి రావచ్చా?" కరకుగా ప్రశ్నించారు

శార్వరి ఆలోచనలకు అంతరాయం ఏర్పడింది.

గుమ్మం నుంచి కాస్త తప్పుకుని వాళ్లు లోపలకి రావటానికి దారిచ్చాడు.

ఆ నలుగురూ డ్రాయింగ్ రూంలోకొచ్చారు. చేతుల్లో ఉన్న సూట్ కేసుల్ని సోఫాలోకి విసిరేశారు.

"ఏ కాగితాలు చూపించమంటారో? మరేం లెక్కలడుగుతారో?"

శార్వరి ఆందోళన చెందుతున్నాడు.

భయం వల్ల ఒళ్లంతా చెమట పట్టింది. గొంతు తడారిపోతోంది.

వాళ్లు అవేం చెయ్యలేదు.

నేరుగా వంటింట్లోకి ప్రవేశించారు.

వంటింట్లో కాఫీ పెడుతోంది సమంత.

వాళ్లని చూడగానే ఉలిక్కిపడి... గట్టిగా అరవబోయింది. తన భర్త వాళ్ల వెనగ్గా కనపడటంతో తమాయించుకుంది.

ముందుగా వాళ్లు బియ్యం డ్రమ్ము తెరిచారు. అందులో ఉన్న బియ్యాన్ని తీసి పక్కన కుప్పగా పోసి అడుగున ఉన్న శాటిన్ సంచుల బొత్తి తీశారు.

అందులో నుంచి డజనుకు పైగా బంగారు బిస్కెట్లు, చంద్రహారం, కాసుల పేర్లు, మరికొన్ని ఆభరణాలు బయటకు తీశారు. ఆ తర్వాత వాళ్ల చూపు శనగపిండి డబ్బా పైన పడింది. దానిలోనూ సంచులు, బంగారు ఆభరణాలు... పెసరపప్పు డబ్బా, కందిపప్పు డబ్బా, రవ్వల డబ్బాలు వంటింట్లో దేన్నీ వదలలేదు. ఆఖరికి పోపుల డబ్బా కూడా ఖాళీ చేసి దొరికిన

బంగారు వస్తువులన్నీ తీసి బయట పడేశారు.  " ఇన్నాళ్లు  కూడబెట్టింది మొత్తం ఊడ్చిపెట్టుకుపోయేటట్టుందే.. అలా బెల్లం కొట్టిన రాయిలా చూస్తుండి పోయే బదులు.. బతిమాలో, బెదిరించో ఈ ఆగడాన్ని ఆపవచ్చు కదా..." మనసులోనే భర్తను తిట్టుకుంటోంది సమంత.

'నీకు బంగారం కావాలా? భర్త కావాలా అంటే.. ఆమె మనసు మొదటి దాని వైపే మొగ్గుచూపుతుంది. ఇంట్లో నగదు కళ్లబడితే దాన్ని బంగారం బిస్కెట్టుగానో, ఆభరణంగానో  మార్చేదాకా ఆమెకు నిద్రపట్టదు.  ఇప్పుడు కళ్ల ముందు జరుగుతున్నది ఆమెకు భరించరానిదిగా మారింది. శార్వరి  అచేతనంగా నిలబడి చూస్తున్నాడు.

వాళ్ల నలుగురూ పూజగదిలోకి ప్రవేశించారు. దేముని మందిరం భారీగా ఉంది.చిన్నపాటి  బంగారు సింహాసనం, పళ్లాలు, దీపం కుందులు, అగరొత్తుల స్టాండు, ఉద్ధరిణె, గరిటె, గంధం గిన్నె  అక్కడున్న వస్తువులన్నీ  బంగారంతో చేసినవే.

ఆ వస్తువులన్నీ సర్ది ఓ చోట కుప్పగా పోశారు. తర్వాత  బెడ్రూంలోకి నడిచారు. మంచం పైనున్న పరుపును లాగి అవతల పారేశారు.అది స్టోరేజ కోసం ప్రత్యేకంగా రూపొందించింది. పై నున్న అరలను తీసి అందులో ఉన్న సంచులన్నీ బయటకులాగారు.

ఆ మధ్య కేంద్ర మంత్రి  కూతురు పెళ్లికి  ఆహ్వానం వస్తే సమంత ప్రత్యేకంగా ఆభరణం తయారుచేయించుకుంది. దాదాపు కోటిన్నర విలువైనది. సాధారణంగా ఓసారి ధరించటానికే  దాన్ని తయారుచేస్తారు. ఆ తర్వాత జ్యుయెలరీ షాపు వాడికిస్తే మార్చి కొత్తనగగా మార్చి ఇస్తారు. ఇది లేటెస్ట్ ట్రెండు.  అయితే అప్పట్లో వీలుకాక ఆ నగని  అలాగే ఉంచేసింది.

"ఇది కూడా ఈ వెధవల పాలు పడుతోంది" పళ్లు కొటకొట కొరుక్కుంటూ తిట్టుకోసాగింది సమంత.

బీరువా, పుస్తకాల అరలు, వాడేసిన దినపత్రికల అడుగున దేన్నీ వదలటం లేదు. అన్నీ జల్లెడ పట్టి ఎక్కడెక్కడో ఉన్న వాటినన్నింటిని బయటకు లాగుతున్నారు.కుప్పగా పోసిన ఆభరణాలన్నింటిని జాగ్రత్తగా సూట్ కేసుల్లో సర్దుకుంటుంటే.. చేష్టలుడిగి చూస్తుండిపోయాడు శార్వరి.

" సాయంత్రం ఆఫీసుకొచ్చి వీటన్నింటికి ఆధారాలు చూపించండి. మీరు చెప్పింది సహేతకమనిపిస్తే వాటిని అప్పటికప్పుడే మీకు తిరిగొస్తాం. లేకపోతే కోర్టుకు సమర్పిస్తాం".

తిరిగివెళ్లే ముందు గట్టిగా చెప్పారు.శార్వరికి ఏం చేయాలో పాలుపోలేదు.ఇల్లంతా చెల్లాచెదురయిన వస్తువులతో చిందరవందరగా తయారైంది.

ఇప్పుడు పత్రికల వాళ్లు, టీవీల వాళ్లు.. మీడియా అంతా కలసి తన పరువు తీస్తారు.''ఇదంతా అవినీతి సంపాదన... బంగారం ఎంత కూడబెట్టారో చూడండి'' అంటూ తన ఫొటోలతో సహా చూపిస్తారు. గంటలు గంటలు ఇదే సంఘటన మళ్లీ మళ్లీ ప్రచారం చేస్తూ కుటుంబాన్ని మొత్తం బజారున పడేస్తారు'' కుమిలిపోయాడు శార్వరి. నాలుగేళ్ల క్రితం నాటి సంఘటనలు కళ్లముందు మెదిలాయి. పాత జనరేషన్ కంప్యూటర్లు కుప్పలు తెప్పలుగా గోడౌన్లలో మగ్గుతున్నాయి. వాటిని ఎలాగోలా వదిలించుకోవాలని సదరు కంపెనీ పన్నాగం పన్నింది.ప్రభుత్వంలో కీలకమైన కేబినేట్ సెక్రటరీ స్థాయి అధికారిని పట్టుకుంది. రహస్య మంతనాలు, బేరసారాలు నడిచాయి. ప్రతి వస్తువు కొనుగోళ్లలో సాధారణంగా ముట్టే పది, పన్నెండు శాతానికి అదనంగా ఇంకో పదిదాకా ఇచ్చేందుకు మధ్యవర్తుల ద్వారా ఒప్పందం కుదిరింది.ప్రాజెక్టు విలువ తక్కువేం కాదు. దాదాపు 2, 500 కోట్లు.తిలాపాపం.. తలా కొంచెం.. ఇందులో పాలుపంచుకున్న వాళ్లందరికీ బానే ముట్టింది.

ఓ చిన్న అధికారిగా తను అప్పట్లో డిప్యూటేషన్ పైన ఢిల్లీలో పనిచేస్తున్నాడు. ఫైళ్లు రూపొందించిన తనకి కూడా కొంత పడేశారు.దేశమంతటా కంప్యూటర్ల సరఫరా సాగిపోయింది. ఇంకో పదిశాతం వస్తువులు మిగిలి ఉన్నాయనగా పై స్థాయిలో అధికారమార్పిడి జరిగింది.కొత్తగ వచ్చినతను ఘటికుడు.

''మార్కెట్లోకి కొత్త జనరేషన్ కంప్యూర్లు ఇన్నుండగా..ఇవేం కంప్యూటర్లు... ఇదేం కీబోర్డు.. ఏ...ఎస్..డీ...ఎఫ్ క్రమంలో ఉండాల్సింది ఏ... బీ...సీ ... రూపంలో ఉందేమిటి? '' నానాయాగీ చేశాడు.సహచరులంతా నచ్చచెప్పారు.'' బాబూ.. నాలుగయిదేళ్లలో ఉద్యోగాలు వదిలేసి మూటా ముల్లె సర్దుకుని పోవలసిన వాళ్లం. కుటుంబ బాధ్యతలు అనేకం ఉన్నాయి. ఈ లోపు నాలుగురాళ్లు వెనకేసుకుందాం. అనవసరంగా గొడవ చేయక. కంపెనీ వాళ్లతో మాట్లాడి నీకూ ఏదో సర్దుబాటుచేస్తాం''. అన్నారు.

అతను ససేమిరా అన్నాడు.'' అసలు ఒప్పంద పత్రంలో వాళ్లు చెప్పిందేమిటి? జరిగిందేమిటి? వెంటనే ఒప్పందం రద్దు చేసుకోవాలి. కంపెనీ తన సొంత ఖర్చుతో సరఫరా చేసిన కంప్యూటర్లన్నింటిని వెనక్కి తీసుకోవాలి'' అంటూ ప్రభుత్వానికి నాలుగు పేజీల లేఖ రాశాడు. ప్రభుత్వం శాఖల్లో ఫైళ్లు, కాగితాలే మాట్లాడతాయి. ప్రశ్నిస్తాయి. నిలదీస్తాయి. చివరికి గుదిబండలై మెడకు చుట్టుకుంటాయి.

కేంద్రంలో ప్రభుత్వం మారింది.. బహుశా ఆ ఫిర్యాదు సీబీఐకి చేరినట్టుంది. ''.. అయినా.. పెద్ద పెద్ద తిమింగలాలను వదిలి తన లాంటి చిన్న చేపకు వలవేశారేంటి?'' శార్వరి కుమిలిపోయాడు.

ఇద్దరూ తేరుకుని ముందు కాఫీ తాగారు.  “ వీలయినంత త్వరగా దీన్లోంచి బయటపడాలి. సాధ్యమయినంత త్వరగా సిబిఐ ఆఫీసుకు వెళ్లాలి ” అనుకున్నారు.

టీవీ ఆన్ చేసింది సమంత.  ఏ ఛానల్లోనూ  ఈ విషయం రావటంలేదు. గోరంతలు కొండతలు చేసి నానారచ్చా చేసే టీవీవాళ్లు...సిబిఐ దాడులను విస్మరించటం  ఆశ్చర్యాన్ని కలిగించింది ఆమెకి.

ఈ విషయం ఇంకా బయటకు పొక్కలేదు. సిబిఐ వాళ్లు ప్రెస్ మీట్ విషయాన్ని కక్కేలోపు తను  ఇందులో నుంచి బయటపడాలి. “ కాళ్లు పట్టుకుని బతిమాలో,బామాలో, లేకపోతే అక్కడున్న అధికారులను డబ్బుతో కొనేసో....” దృఢంగా అనుకున్నాడు శార్వరి. అదే మాట భార్యకీ చెప్పాడు.

“ పోయిన బంగారం అంతా తిరిగిచ్చేటట్టు చూడండి.” మరికాసేపట్లో వాళ్లిద్దరూ ప్రయాణిస్తున్న కారు రోడ్డెక్కింది.ఆ నగరంలో ప్రభుత్వ కార్యాలయాన్ని ఒకే చోట ఉంటాయి.కారును రోడ్డుకు దూరంగా ఓ  మూలగా పార్కుచేసి భార్యాభర్తలిద్దరూ కాలినడకన అక్కడకి చేరారు.తమకు కావలసిన కార్యాలయాల గురించి వెతకసాగారు.

కాంప్లెక్సు అంతా రెండు మూడుసార్లు అటూఇటూ కలియతిరిగారు. ఎక్కడా సిబిఐ  పేరుతో కార్యాలయం కనిపించలేదు.ఊరుబయట కొత్తగా కొన్ని ప్రభుత్వ కార్యాలయ  భవనాలు కట్టిన విషయం గుర్తుకొచ్చింది.అక్కడకి కూడా వెళ్లి వెతికారు.తనను గుర్తించే అవకాశం లేని కార్యాలయం దగ్గర ఆగి నిర్ధారించుకున్న తర్వాత విషయం అర్ధమైంది.“ మీరెందుకు ఈ కార్యాలయం గురించి వాకబు చేస్తున్నారో తెలుసుకోవచ్చా...” కఠినంగానే అడిగాడు అక్కడి ఉద్యోగి.  ఆ తర్వాత చెప్పాడు.

“ ఈ ఊరిలో సిబిఐ  కార్యాలయం ఉండదు” స్పష్టం చేశాడు.

తలతిరిగిపోయింది శార్వరికి.

“ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి ... సిబిఐ గురించి తనకు తెలియకపోవటమేటి?”

వచ్చిన వాళ్లు సీబీఐ అన్నారా?

ఏసీబీ అంటే.. తనేమయినా పొరపాటుగా విన్నాడా?”

ఆ రాత్రంతా ఇద్దరూ కంటిముందు కునుకులేకుండా గడిపారు.

మరో రెండ్రోజులు గడిచాయి.

మూడో కంటికి      ఈ విషయం తెలియలేదు.

“ పోనీ.. పోలీసులకు ఫిర్యాదు చేస్తే..” పోయిందానిలో కొంచెంకాకపోతే.. కొంచెమయినా వెనక్కితిరిగొస్తుంది” భర్తకు సూచించింది.గయ్ మన్నాడు శార్వరి.

“ అమ్మో వద్దొద్దు..

ఈ బంగారం ఎలా కూడబెట్టావని ఆరాతీస్తే..

ఆదాయం పన్ను అధికారులు, ఆ తర్వాత విజిలెన్సు వాళ్లు …

ఒకరితర్వాత మరొకరు వచ్చి ప్రాణం తీస్తారు.

అసలే నాకు డిపార్టుమెంటులో శత్రువు లెక్కువ.

మూకుమ్మడిగా కలసి సర్వనాశనం చేస్తారు'' వివరంగా చెప్పాడు.

'' అయితే.. మనం చేయగలిగిందేమీలేదన్న మాట'' నిస్పృహగా అడిగింది.

అవునన్నట్టుగా తలాడించాడు శార్వరి.

'' సీబీఐ అని చెప్పి.. ఎంత తెలివిగా దోచుకుపోయారు.

వాళ్లు ఇల్లంతా ఊడ్చిపెడుతుంటే...

తెలివితక్కువగా కళ్లప్పగించి చూస్తుండిపోయాడు తను.

స్టూవర్టుపురం ముఠా ఇలాగే దోపిడి చేస్తుందట.

బీరువాల్లో కాకుండా..పప్పూ ఉప్పు దాచుకునే చోట్లన్నీ గాలిస్తారట.

తమ ఇంట్లో బంగారం ఉందన్న విషయం తెలిసి.. పట్టపగలు వచ్చి దర్జాగా దోచుకుపోయారు ఆ నలుగురూ.'' కోపం, బాధ, అన్నీ ఒకేసారి దాడిచేశాయి శార్వరిపైన.

'' బంగారం పోతే పోయింది. మళ్లీ సంపాదించుకోవచ్చు...

వచ్చిన వాళ్లు నాలుగుతన్ని కాళ్లూ కీళ్లు విరిచేసుంటే...

హమ్మో ఇంకా ఏమయినా ఉందా?''

తనకి తనే సర్దిచెప్పుకున్నాడు.

మరికాసేపటికి పోయిన బంగారం గురించి ఆలోచించటం మానేసి.. కొత్తగా సంపాందించటమెలా అన్నది అతని మెదడు ఆలోచించటం ప్రారంభించింది. అతను అవినీతిలో ఆరితేరిన వాడు మాత్రమే కాదు. చాలా తెలివైన వాడు కూడా.

'' అర్జంటుగా ఉన్న సీట్లో నుంచి మారాలి. ఈ మధ్య ఇరిగేషన్ కాంట్రాక్టర్లకి మొబిలైజేషన్ అడ్వాన్సులిస్తోంది ప్రభుత్వం. ఆ సీటు దక్కితే ఐదారు నెలల్లోనే మళ్లీ సంపాదించవచ్చు.'' అనుకున్నాడు.

ఎవరెవరిని పట్టుకుంటే పనవుతుందో..

గబగబా లెక్కలేయటం ప్రారంభించాడు. ఇవేమీకాకపోతే ఏదయినా పెద్ద ప్రాజెక్టు పట్టాలి. డిప్యూటేషన్ కి వెళ్లయినా '' పట్టుదలగా అనుకున్నాడు. బాగా పరపతి ఉన్న తన ఊరు సర్పంచి మొదలు పెట్టి ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్రమంత్రి పి.ఏ., పేరుమోసిన కాంట్రాక్టర్లు, పొలిటికల్ బ్రోకర్లు.. ఇలా ఎవరినీ విడిచిపెట్టలేదు. అందరికీ తలో మాటా వేశాడు. పని పూర్తయితే తనెంత ఇవ్వగలడో కరాఖండీగా చెప్పేశాడు.

''ఈ ప్రపంచంలో డబ్బుతో పొందలేనిది లేదు. తెల్లవారేటప్పటికల్లా ఏదో ఒకటి వర్కవుట్ అయి తీరుతుంది.'' ఆ రాత్రి ధీమాగా అనుకున్నాడు శార్వరి.

భర్త చేస్తున్న ప్రయత్నాలు చూసి సంబర పడింది సమంత.'' మరేం ఫరవాలేదు. తన ఇల్లు బంగారంతో మళ్లీ కళకళలాడితీరుతుంది'' సంతృప్తిగా అనుకుంది.

మళ్ళీ సమాజం మీద దండయాత్రకు బయలుదేరాడు శార్వరి...తాజెడ్డ కోతి వనమెల్ల చెరచడానికి బయలుదేరినట్టు...బురదలో పొర్లాడిన పంది, వీధులన్నీ మురికిమయం చెయ్యడానికి బయలుదేరినట్లు......




నానాటి బ్రతుకు నాటకము

కానక కన్నది కైవల్యము...

పుట్టుటయు నిజము , గిట్టుటయు నిజము

నట్టనడుమ నీపని నాటకము...

అన్న అన్నమాచార్య సంకీర్తన గుర్తుకొస్తుంది.ఈ జగన్నాటకాన్ని చూస్తుంటే

అవును నిజమే కదా , పుట్టటం నిజం,గిట్టటం నిజం నడుమ ఈ జీవితమంతా నాటకమే కదా!జగన్నాటకమే కదా!! ఈ జగన్నాటకంలో పశుపక్ష్యాదుల నుంచి , క్రిమికీటకాదుల నుంచి అన్నీ తెలిసిన ,ఏమీ తెలియని మనిషి వరకు అందరికీ బ్రతుకంటే బోలెడంత తీపి. నాకూ బ్రతకాలని ఉంది   అని అనుకోని క్షణం రాని జీవితం, ఈ లోకంలో ఏ ప్రాణికీ ఉండదేమో. తినగ తినగ వేము తీయనుండు   అన్న వేమన   మాటల్ని కొంచం మారిస్తే   తినగ తినగ తీపి కూడా చేదవుతుందనిపించటం లేదూ...అయినా మనకుందిగా తినగా తినగా గారెలు కూడా చేదవుతాయట అలాగే బ్రతగ్గా బ్రతగ్గా బ్రతుకుమీద ఉన్న తీపి కూడా చేదవుతుందేమో...

బ్రతుకు బ్రతకడానికి కాదనుకున్నప్పుడు... బ్రతకాలంటే భయం కలిగినప్పుడు... చచ్చే వరకు బ్రతకాలి అన్నది మరిచినప్పుడు... బ్రతుకు మహా చేదవుతుంది , బ్రతుకు బండెడు బరువవుతుంది.

*************

దీపం మిణుకు మిణుకు మంటూ వెలుగుతోంది, వెలుతురు స్థిరంగా లేక వణుకుతోంది... పోవాలో ఉండాలో తెలియని ప్రాణంలాగా, సడీ చప్పుడు కాకుండా వీస్తున్న చల్లగాలికి. చీకటి,వెలుతురు నువ్వా నేనా అంటూ సమరం సాగించే సమయమది. చీకటే ఎక్కువ ఆవరించింది దీపంలో నూనెలేక,వెలుతురుని కాపాడుకునే చేతుల్లేక...వర్షం కురిసి వెలవలేదు , గొడవ జరిగి ఆగలేదు... అయినా ఆ ఇల్లు ఎంత ప్రశాంతంగా ఉందంటే బహుశా తుఫాను ముందు ప్రశాంతత అంటే అదేనేమో.ఆ ఇంట్లో మిగిలేది చీకటే అని చెప్పటం కోసమేనేమో చావాలనుకుంటున్న ఆ తల్లిపిల్లల మధ్య చీకటే మిగిలింది .

కరెంట్ పోయింది...

నిశ్శబ్దం ఎంత భయంకరంగా ఉంటుందో అప్పుడే అర్థమయ్యింది వాళ్ళకి... ఆ అరుపులు విని పిల్లలిద్దరూ ఉలిక్కి పడ్డారు,సీతామహాలక్ష్మితో సహా...చెవులు రిక్కించుకొని వినవలసిన అవసరం లేదు రాత్రి వేళ కావడం చేత అరుపులు స్పష్టంగా వినిపిస్తున్నాయి . నా కూతుర్ని రక్షించండి,నా కూతుర్ని కాపాడండి అంటూ ఆ తల్లి చేస్తున్న ఆర్తనాదాలు విని సీతామహాలక్ష్మి అలా తలుపు వరకు వెళ్లి చూద్దాం అనుకుంది.వెంటనే నా బ్రతుకే బండలైనపుడు   ఇంకొకరిది మనకెందుకు అనుకుంది .వెనువెంటనే నలుగురితోపాటు నారాయణ, కులంతో పాటు గోవిందా అన్నారు. నలుగురూ ఉండే ఊరు ,నవ్వుకైనా,ఏడుపుకైనా నలుగురు కావలసిన తీరు..అందుకే అలా ఇంటి వాకిలి   వరకూ   వెళ్ళింది   ఏమిటో చూద్దామని...

మంటలు నర్తిస్తున్నాయి , మంటలు కీర్తిస్తున్నాయి...

ఏ నాట్యమో తెలియదు , ఏ రాగమో తెలియదు ...

కాని ఆ కళలో కాలిపోతుంది ఆడది,అది మాత్రం తెలుస్తుంది...లో లోపల నవ్వుకుంది. కాదు కాదు నవ్వుని అలుముకుంది...అయ్యయ్యో సాటి ఆడది మంటల్లో కాలిపోతుంటే ఆ దృశ్యాన్ని చూసి భయపడనేమిటి,ఆ సంఘటనకు బాధపడనేమిటి అసలు నేను ఆడదానినేనా అనుకుంది...నేను ఆడదానిని కాకపోవడం ఏమిటి ఆడదానినే, లేదంటే భర్త కొట్టినా,తిట్టినా,సిగరెట్లు కాల్చి వాతలు పెట్టినా, సీతామహాలక్ష్మి అని పేరు పెట్టుకున్నందుకు ఆ సీతామ్మవారిని అనుమానించినట్టు నన్ను అనుమానిస్తున్నా సీతమ్మోరిశరలు పడుతూ ఇంకా ఎవరిని చంపకుండా లేదా నేను చావకుండా సహనంతో ఉన్నానంటే నేను ఆడదానినే...

..... తన ఆలోచనల్లో స్థిరత్వం లేదు..వాళ్ళింట్లో వెలుగుతున్న దీపపు వెలుగు లాగా.....

సీతామహాలక్ష్మికి అది చూసిన తరువాత భయం అనిపించలేదు,బాధ అంతకన్నా లేదు అసలు తను మనిషినన్న భావనతో చలించనూ లేదు.. ఎందుకంటే తనకు ఇదేం కొత్త కాదు. అడుగడుగునా జరిగేదే కదా, అడుగడుగునా ఇదే కథ. ఏం జరగనట్టు లోపలికెళ్ళి కూర్చుంది సీతామహాలక్ష్మి.

*************

పాపం పిచ్చితల్లి, నాకు బతకాలనుంది...నాకు బతకాలనుంది అని ఎంత తపనపడిందో పాపిష్టి దేవుడు ప్రాణం లాక్కెళ్ళిపోయాడు.పసిపిల్లల్ని తల్లిలేనిదానిని చేశాడు.అంతా కట్టుకున్నోడివల్లే.... భూమిమీద నూకలు చెల్లిపోనాయి ఎల్లిపోయింది , తినే రాత లేదు, చిన్న వయసు అప్పుడే నూరేళ్ళునిండిపోనాయి,ఇంకెక్కడ కనిపిత్తది సచ్చిపోయింది అని ఆయమ్మ,ఈయమ్మ అనుకుంటున్న మాటలు సీతామహాలక్ష్మి చెవిన పడ్డాయి... అంతలోనే సీతామహాలక్ష్మి కూతురు చిన్నితల్లి...ఐదు ఆరేళ్ళు ఉంటాయనుకుంట...అమ్మా చచ్చిపోతే మన గురించి ఇంతే మాట్లాడుకుంటారా,మనం ఇంక ఎవరికీ కనిపించమా, మనం కూడా అలా మంటల్లో కాలిపోతామా... (ఎప్పటి నుంచో కాలిపోతున్నారన్న సంగతి తెలియక) , ప్రశ్నల మీద ప్రశ్నలు అడుగుతూ, చచ్చిపోయే ముందు నాకు బతకాలని ఉంది అని ఆ ఆంటీలాగా మనం కూడా అంటామా అమ్మా...!! అని అడిగితే సమాధానం చెప్పలేక పోయింది సీతామహాలక్ష్మి.

అమ్మా...నాకూ బతకాలని ఉంది  అని చిన్నితల్లి అంటే తల్లి గుండెలు బ్రద్దలైపోయాయి ...అమ్మా చెప్పమ్మా.. మనమెందుకు చచ్చిపోవాలి...  మా మాష్టారు చెప్పారు బ్రతుకున్నది బ్రతకటం కోసమని  కాని నువ్వు చచ్చిపోదామంటున్నావు.బళ్ళో మాష్టారు చెప్పింది కరెక్టా,ఇంట్లో అమ్మ చెప్పేది కరెక్టా ఇప్పుడు నేను ఎవరిమాట వినాలమ్మా..నాకూ బతకాలనుందమ్మా అని చిన్నితల్లి మాట్లాడే పెద్ద మాటలకు  సీతామహాలక్ష్మి ముఖం చిన్నబోయింది , గొంతు మూగబోయింది. కాని చిన్నితల్లి గొంతు పెద్దదయ్యింది... చెప్పమ్మా...మనం ఎందుకు చచ్చిపోవాలి.ఓ...ఓ..హెచ్ ఐ వి ఉంటే ఎలాగూ చచ్చిపోతాం కదా అందుకే చచ్చిపోదామంటున్నవా... గుండెల్లో వేగం,పెదవుల్లో వణుకు,కళ్ళల్లో నీళ్ళు ... ఈ విషయం చిన్నితల్లికి ఎలా తెలిసిందో అర్ధం కాలేదు.ఇదిగో తోక అంటే అదిగో పులి అనే సమాజంలో బ్రతుకుతున్నాం మనం, ఆ విషయం అర్ధమైతే చాలు.గోరంతలుదానిని కొండంతలు చేయటం జీవితంలో ఎప్పుడైనా చేసుంటే చాలు  చిన్నితల్లికి ఎలా తెలిసిందో అర్ధమవుతుంది.

************

విషాద సమయం ఆసన్నమయ్యింది.వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు సెకన్ల ముల్లు,వెళ్ళాలా వద్దా అన్నట్టు నిముషాల ముల్లు గంటల ముల్లు నేసుకొని ఎట్టకేలకు 12 మీదకు చేరాయి.. భారంగా...సీతామహాలక్ష్మి జీవితంలా. ఇక ఆఇంట్లో రాహు కాలాలు ,యమ ఘడియలు  మొదలవబోతున్నాయి రోజులాగా... సమయం అర్ధరాత్రి 12 దాటింది.రఘురామ్ ఇంకా ఇంటికి రాలేదు.ఈపాటికి రావాలి...గంటలు 12 మ్రోగగానే అమ్మా నాన్న వస్తాడేమో కనిపించకుండా ఎక్కడైనా దాక్కుందామా,ఎటైనా పారిపోదామా నిన్న కొట్టిన దెబ్బలు ఇంకా తగ్గలేదు రా.. అమ్మా...ఎటైనా వెళ్దాం,పోనీ నువ్వు చెప్పినట్టు చచ్చిపోదామా,నాన్న కొట్టే దెబ్బలు తినడంకంటే చచ్చిపోవడమే నయం.బళ్ళో మాష్టారు చెప్పింది కాదమ్మ నువ్వు చెప్పిందే కరెక్ట్ చచ్చిపోదామమ్మా...

పిల్లల్ని గుండెకు హత్తుకుంది ఏంకాదు తల్లీ ఏంకాదు నాకు బతకాలనుంది అన్నావు కదా నీకే కాదు నాకూ బతకాలనుంది .ఈ రాత్రి గడవనీ తల్లీ ,రేపటి ఉదయం నుంచి మనం బతుకుదాం.బతుకంటే ఏమిటో తెలియచెప్పేలా బతుకుదాం, బతుకు విలువ అందరికీ తెలిసేలా బతుకుదాం.మన బతుకు మనం బతుకుదాం... పదండి పడుకుందాం అంటూ పిల్లల్ని నిద్రపుచ్చింది సీతామహాలక్ష్మి. చిన్నితల్లికి ఏమీ అర్ధం కాలేదు. నిద్రపోతున్నట్టు నటిస్తూ ఏం జరగబోతుందా అని ఎదురుచూస్తుంది. ఏదో హర్రర్ అండ్ సస్పెన్స్ సినిమా చూస్తున్నదానిలా...

**************

గేటు విరిగినట్టుంది , తలుపు పగిలినట్టుంది సీతామహాలక్ష్మి పిల్లల దగ్గర్నుంచి లేచి వచ్చేలోపే... రఘురామ్ అరిచిన అరుపులకు భయపడిపోయిందనుకుంట పోయిన కరెంట్ కూడా తిరిగి వచ్చింది . అంతకు ముందే వేసిన లైట్లు వెలిగాయి,ఫ్యాన్లు తిరిగాయి,టి.వి ఆన్ అయ్యింది అంతే కరెంట్ బిల్లు ఎవడు కడతాడే నీ పుట్టింటోళ్ళా...ఎవడి బాబు సొమ్ము ఇక్కడ తేరగా ఉందని

ఇన్ని లైట్లు, ఫ్యాన్లు...అవునూ! నేను లేకుండా పడకగదిలో ఏంచేస్తున్నవే,ఆ జుట్టు ఏంటే అలా చెరిగిపోయింది, ఆ చీరేంటే అలా నలిగిపోయింది...ఇలా అయినదానికి , కానిదానికి భార్యను తిట్టడం, కొట్టడం మొదలుపెట్టాడు రఘురామ్.ఇది తనకి కొత్తేం కాదు,అలవాటే....ఫ్రిజ్ లో ఉన్న మందు సీసా తీసుకురమ్మన్నాడు తెచ్చింది ,వేడి వేడిగా ఆంబ్లెట్ తీసుకురమ్మన్నాడు తెచ్చింది. వాళ్ళూ వీళ్ళూ అన్న మాటలు అప్పుడు గుర్తొచ్చాయి .ఆ మందు కలిపేటప్పుడు కాస్త ఎంట్రిన్ కూడా కలిపితే పీడవిరగడ అవుతుంది. ఆడదాని కడుపు చీల్చుకొని పుట్టిన వాడు ఆడదాని కడుపు మీద తంతున్నాడు.ఆడదాని ఉసురు తగిలి.... వాడిలాంటి వాళ్ళు బ్రతికితే, చస్తే... భూమికి భారం తీరుతుంది. ఈ మాటలు వింటే మొదట్లో పట్టలేనంత దుఖం వచ్చేది సీతామహాలక్ష్మికి కాని ఇప్పుడు...

సీతామహాలక్ష్మి భారతీయ స్త్రీ కదా!తనకు పతియే ప్రత్యక్ష దైవం.భర్త తాగుబోతు అయినా,తిరుగుబోతు అయినా కొట్టినా,తిట్టినా పసుపు-కుంకాలూ, మనసు-మాంగల్యాలూ అంటూ పడి ఉండే సీతామహాలక్ష్మి లాంటి వాళ్ళు మారనంతకాలం రఘురామ్ లాంటి వాళ్ల ఆటలు సాగుతూనే ఉంటాయి.

************

తరాలు మారిపోతున్నాయి , అంతరాలు పెరిగిపోతున్నాయి , విలువలు తరిగిపోతున్నాయి ...

మనసులు కరిగిపోతున్నాయి , మమతలు చెరిగి పోతున్నాయి , కలతలు పెరిగిపోతున్నాయి ...

మనుషుల ఆలోచనలు , జీవన విలువలు , వేష భాషలు , ఆహారవిహారాలు అన్నీ అన్నీ మారిపోతున్నాయి

ఇన్ని మారగా లేనిది సీతామహాలక్ష్మి మారితే ఏమవుతుంది...మారిపోయింది . భర్త కొట్టిన దెబ్బలకు రక్తంకారినపుడు, ఇరుగు,పొరుగు వాళ్ళు చూసి ఇక ఇకలు,పక పకలు విదిలించినపుడు, ఒళ్ళు పులిసిపోయి నీరసంగా చెకప్ కోసం వెళ్ళినపుడు,ఆమెను చూసి, చెకప్ చేసి హెచ్.ఐ.వి అని చెప్పినప్పుడు ,తనతో పాటు తన పిల్లలకు కూడా హెచ్.ఐ.వి అని తెలిసినపుడు, వీటన్నిటికీ కారణం తన భర్తే అని అందరూ అన్నపుడు కూడా మారని సీతామహాలక్ష్మి నాకూ బతకాలనుందమ్మా అని చిన్నితల్లి అన్నప్పుడు మారిపోయింది. ఎంతైనా అమ్మ కదా! ప్రాణం పోస్తుందే కాని ప్రాణం తీయదు కదా!!

రఘురామ్ ని మందులో ఎంట్రిన్ కలిపి చంపుదాం అనుకుంది,ఆంబ్లెట్ లో సైనైడ్ కలిపి చంపుదాం అనుకుంది , కిరోసిన్ పోసి తగలబెడదామనుకుంది , కత్తితో కండగా నరుకుదామనుకుంది, ఇనుపరాడ్డు తీసుకొని తలబద్దలు కొడదామ నుకుంది ఇలా ఎన్నో ఆలోచనలు...ఒక్కసారిగా సీతామహాలక్ష్మి ని చుట్టుముట్టాయి.ఇవేవీ చేయకూడదను కుంది.ఒక్కసారి కూర్చొని మాట్లాడాలనుకుంది , రఘురామ్ తో మాట్లాడటం మొదలుపెట్టింది

యావండీ !

ఎందుకిలా తాగుతున్నారు,తాగి తాగి ఇల్లు,ఒళ్ళు గుల్ల చేస్తున్నారు ఊళ్ళో, బంధువుల్లో పరువు లేకుండా పోయింది.పేరుకే మనుషుల్లాగా బతుకుతున్నాం. ప్రాణం లేని బంగారానికైనా విలువుంది కానీ మన బతుకులకు విలువలేకుండా పోయింది. ఇప్పటికైనా ఈ తాగుడు, తిరుగుడు మానండి, నా మాట వినండి , రఘురామ్ తను మాట్లాడే మాటలు వింటున్నాడనుకుంది కాని తను తాగిన మత్తులో నిద్రలోకి జారుకున్నాడు.తను మాట్లాడిన మాటలన్నీ రఘురామ్ కి జోలపాటలయ్యాయి.అయినా వదల్లేదు బిందెడు నీళ్ళు ముఖాన కొట్టి మరీ లేపింది మళ్ళీ మాట్లాడటం మొదలుపెట్టింది ఎందుకు మా జీవితాలు నాశనం చేశారు,ఎందుకిలా తాగుతున్నారు చెప్పండి ..చెప్పండి అని కాలర్ పట్టుకొని సీతామహాలక్ష్మి అడిగిన ప్రశ్నకు రఘురామ్ చెప్పిన సమాధానం నాకు బతకాలని ఉంది అందుకే తాగుతున్నాను, తాగకపోతే నేను బతకలేను అందుకే తాగుతున్నాను.ఏం చేస్తావు. ...ఏం...చేస్తావు... ఏంచేస్తావో చేసుకో, నీ దిక్కున్న చోట చెప్పుకో.... నీదిక్కున్న చోటికిపో.... అని రఘురామ్ తాగిన మత్తులో కూడా తడబడకుండా చెప్పాడు.

ఏంచేస్తావో చేసుకో, నీ దిక్కున్న చోట చెప్పుకో... నీదిక్కున్న చోటికిపో...పదే పదే , ఇదే ఇదే సీతామహాలక్ష్మికి గుర్తొస్తుంది అవును ఆడదానికి పెళ్ళి అయితే దిక్కూ మొక్కూ లేనట్టే...మొగుడు ఏం చేసినా గుట్టు చప్పుడు కాకుండా కాపురం చేసుకోవాలనే వాళ్ళే తప్ప అక్కున చేర్చుకొని ఆదరించే వాళ్ళు ఎవరున్నారు,పుట్టింటి వాళ్ళ దగ్గర్నుంచి,అత్తింటి వాళ్ళ వరకూ...వయా(జీవితం ప్రయాణం కదా!) బంధువులు కూడా...అందుకే ఆడదానిని తిట్టేటప్పుడు మొట్టమొదట , చిట్టచివర వచ్చే పదం నీ దిక్కున్న చోట చెప్పుకో,నీదిక్కున్న చోటికిపో.... ఆడది ఏం చేయగలదు మహా అయితే చస్తుంది అనుకుంటాం కానీ ఆడది తలచుకుంటే రాజ్యాలు కూల్చగలదు అవే రాజ్యాలు నిలబెట్టగలదు, ప్రాణాలు తీయగలదు అవే ప్రాణాలు పోయగలదు, అణువణువున కనిపించే ఆడది అడుగడుగును కదిలించే ఆడది ఏమైనా చేయగలదు. కానీ సీతామహాలక్ష్మి ఇవేవీ చేయలేదు, పిల్లల్ని తీసుకొని వాళ్ళని బతికించుకోవడానికి తాగకుండా బతకలేని, భరించలేని భర్తకు దూరంగా వెళ్ళిపోయింది .

నాలుగు దిక్కులూ నావేనంటూ... స్వేచ్ఛా జీవిని నేనేనంటూ...నాకూ బతకాలని ఉంది , అంటూ...




పడమటి కొండల దిగువున శర్మిష్టుడనే ముని తన శిష్యులతో పాటు నివసిస్తూండేవాడు..

ఆయన శిష్యులు ఆశ్రమానికి చుట్టుప్రక్కల కొంత ప్రాంతాన్ని సాగు చేసి తమకు కావలసిన అంపరాలు పండించేవారు. ఆ కారణంగా వారికి భిక్షకంటూ గ్రామాల్లోకి వెళ్ళవలసిన అవసరం కలిగేదికాదు. ప్రశాంతంగా ధ్యాన, జపాది కార్యక్రమాలు నిర్వర్తించబడుతూండేవి. కాని చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు మాత్రం తరచుగా ముని దర్శనానికి వస్తుండేవారు. వచ్చిన వాళ్ళు తమకుగల సమస్యలను ఏకరువు పెట్టి తగిన పరిష్కారం సూచించమని కోరుతుండేవారు.

శర్మిష్టుడు వారి సమస్యలు వినడం ఒక బాధ్యతగా భావించేవాడు. నిజానికి వారి సమస్యలు అంత జటిలమయినవీ, పరిష్కరించుకోనలవి గానివి గా వుండేవి కావు. శర్మిష్టుడు ఎవరినీ ఏవిధమయిన పరిష్కారాలు, పరిహారాలు గట్రా సూచించేవాడు కాదు. కాకపోతే, ఎవరంతటవారే తమ సమస్యలను పష్కరించుకునే పరిజ్ఞానం మాత్రం కలిగిస్తుండేవాడు. అందుకు ఆయన వారికి ఏదో ఒక పని అప్పగిస్తుండేవాడు. ఒకసారి వేర్వేరు గ్రామాల నుండి రామేశం, వీరేశం అనే వ్యక్తులు ముని దర్శనానికి వచ్చారు. మొదట రామేశం మునితో తన సమస్యను ఇలా విన్నవించుకున్నాడు. " స్వామీ ! నేనొక మధ్యతరగతి గృహస్తుడ్ని. ఒక కచేరీలో గుమాస్తా ఉద్యోగం చేస్తూ వచ్చిన దానితో తృప్తిగా జీవిస్తుండేవాడిని. కానీ, ఈమధ్య ఎలా జరిగిందో తెలీదు, పని చేస్తున్న చోట కొంతమంది దుస్ట స్నేహితులు నాకు జత అయ్యారు. దానితో త్రాగుడూ, జూదము వంటి దురలవాట్లు నాలో చోటు చేసుకున్నాయి. ఇంకేముంది, పూర్తిగా అప్పులపాలయిపోయాను. ఇక గృహంలో శాంతి సౌఖ్యాలు కరువయి పోయాయి. ఈ చెడు సావాసాలు మానుకొని, పూర్వంలా బ్రతకాలని నాకెంతో కోరికగా వుంది. కాని అది ఎలా సాధ్యమవుతుందో తెలియడంలేదు.! దయచేసి నా సమస్యకు తగిన పరిష్కారం సూచించండి.!!" అని ముగించాడు.

తర్వాత వీరేశం తన వంతు అందుకున్నాడు. " నాకు రాఘవుడని పన్నెండేళ్ళ కొడుకున్నాడు. ఒక్కగానొక్క నలుసని వాడిని ఎంతో గారం చేశాము. చిన్నప్పటినుండి వాడు ఆడింది ఆట, పాడింది పాటగా సాగింది. దానితో వాడు ఏకుమేకై కూర్చున్నాడు. చదువు సంధ్యల మాట ప్రక్కనుంచి, బొత్తిగా ఆకతాయిగా తయారయాడు. నాకు కాస్త కోపం ఎక్కువ. ! సహనం తక్కువ!! ఈ మధ్య వాడి ఆగడాలు భరించలేక చేయి చేసుకోవడం మొదలెట్టాను. దానితో వాడు అలిగి ఇల్లు వదిలి వెళ్ళడం, తిరిగి వెతికి పట్టుకరావడం, ఆనవాయితీగా మారింది. నా కుమారుడ్ని మంచి మార్గంలో పెట్టే ఉపాయం చెప్పి పుణ్యం కట్టుకోండి స్వామీ !" అని కళ్ళనీళ్ళపర్యంతం అయ్యాడు.

అంతా శాంతంగా విన్న శర్మిష్టుడు మొదట రామేశాన్ని తీసుకొని, ఒక బీడు పట్టిన పొలం వద్దకు వెళ్ళాడు. పొలంలోని కలుపు మొక్కలను ఏరివేయమని ఆదేశించాడు. తర్వాత వీరేశం చేతికి ఒక గొడ్డలి ఇచ్చి, కొండ సానువులో పిడుగుపాటుకు గురై ఎండి మ్రోడయిన పెద్ద మ్రాను వద్దకు తీసుక వెళ్ళి, ఎండు కొమ్మలు నరికి, ఆశ్రమానికి కావలసిన వంట చెఋఅకు చేరవేయమని చెప్పాడు. పచ్చని చెట్టును పొరపాటున కూడా నరకవద్దని హెచ్చరించి వెళ్ళాడు.

ముని ఆదేశం మేరకు రామేశం, పొలంలోని కలుపును చకచక ఏరివేయడం ఆరంభించాడు. వీరేశానికి మాత్రం మ్రాను కొమ్మ నరకడం మహా ప్రయాసగా మారింది. కొండ ప్రాంతంలో ఇన్ని చెట్లు ఉండగా, ముని ఈ చెట్టే నరకమని ఎందుకన్నాడో ! తనకేదైనా పరిష్కారం దొరుకుతుందని వస్తే, ఆశ్రమానికి వంట చెఋఅకు అందించే పని తగిలింది.అని వీరేశం విసుక్కున్నాడు. అయినా ముని ఆజ్ఞాపించాడు కనుక లేని ఓపిక తెచ్చుకుని మెల్లిగా నరకడం ప్రారంభించాడు. ఇలా వాళ్ళిద్దరు మరో రెండు రోజులు తమకప్పగించినపని చేయవలసి వచ్చింది.మూడవరోజు పొలం వద్దకు వచ్చిన రామేశానికి, అంతవరకు తను కలుపు ఏరివేసిన ప్రాంతంలో మంచిమొక్కలు ఏపుగా పెరిగి నవనవలాడుతూ కనిపించాయి. ఔరా.! ఈ కలుపు మొక్కలు మంచిమొక్కలకు ఎంత చేటు తెచ్చాయి!! ఈ కలుపు మొక్కల లాంటి వాళ్ళే కదా తన చెడ్డ స్నేహితులు !! వాళ్ళని మొహమాటం లేకుండా దూరంగా వుంచగలిగితే తన జీవితం బాగుపడుతుంది కదా! ఈ విషయం తెలుసుకోవడానికే ముని తనకీపని అప్పగించాడు అని అతనికి

అర్థమయింది.

ఇక వీరేశం కూడా మూడవరోజు తాను నరికిన పెద్ద కొమ్మల మోపు చూసి, తనేనా, ఇన్ని కొమ్మలు నరక గలిగింది?! తనలో ఇంత ఓపిక ఎలా వచ్చిందని తెగ ఆశ్చర్యపోయాడు. తర్వాత ఆలోచించడం మొదలుపెట్టాడు. ఈ ఎండిన మ్రాను లాంటి వాడే తన ఎదిగిన కొడుకు కూడాను.! మొక్కై వంగనిదే మ్రానై వంగునా అని వూరికే అన్నారా? చిన్నతనంలోనే వాడిని దారిలో పెట్టకపోవడం తను చేసిన పెద్ద పొరపాటు. ఇప్పుడు వాడ్ని మంచిమార్గంలో పెట్టాలంటే తనకెంతో ఓపిక, సహనం అవసరం.!! ఈ విషయం గ్రహించాక అతడు తేలిక పడ్డ మనసుతో ముని వద్దకు వచ్చాడు.

అదే సమయంలోనే రామేశం కూడా ముని వద్ద సెలవు తీసుకోవడానికి వచ్చాడు. శర్మిష్ఠుడు ఇద్దరివైపు చూసి, " నాయనలారా! ఈ ప్రపంచంలో పరిష్కరించలేని సమస్య అంటూ వుండదు. సమస్య అంటూ వుంటే దాని పరిసరాల్లోనే పరిష్కారమూ వుంటుంది. కాకపోతే ఎవరంతట వారే దాన్ని వెతికి పట్టుకోగలగాలి. ! అది మీకు తెలియాలనే, మీకు తగిన పనులు అప్పగించాను.! అన్నాడు చిరునవ్వుతో. రామేశం, వీరేశం, మునికి కృతజ్ఞతలు తెలుపుకుని సెలవు తీసుకున్నారు.




లేడి అడవిలో తిరుగుతూ తను స్వేచ్ఛగా సంచరిస్తున్నానని సంబరపడుతూంటుంది. వేటగాడు తన కదలికలను నిశితంగా గమనిస్తూ అదను చూసి వేటాడతాడని ఊహించనైనా లేదు. వేటగాడికి చిక్కిన తర్వాత

నిస్సహాయంగా విలవిలలాడటం తప్ప గత్యంతరం ఉండదు

-----------------------------------------------

‘ఎగిరిపోతే…

ఎగిరిపోతే..

ఎగిరిపోతే ఎంత బావుంటుందీ…”

కూనిరాగాలు తీస్తూ ముస్తాబవుతోంది చామంతి.

ఎదురుగా అద్దం.

అద్దంలో తన రూపాన్ని చూసుకుంది.

మొహానికి మందంగా పౌడర్ దట్టించింది.

ఆ తర్వాత ఒంటికున్న చీరను విప్పి పక్కన పడేసి ఇనప్పెట్టె అడుగునున్న చీర తీసింది. దాన్ని అటూ ఇటూ దులిపి భుజం మీదుగా నడుం చుట్టూ తిప్పి ..

మరోమారు అద్దం చూసుకుంది.

ఆమెకెందుకో నచ్చలేదు. అదీకూడా తీసి పక్కన పడేసి...

మళ్లీ పెట్టె తెరిచింది.

అందులో కనిపించింది ఇంకో చీర.

‘ ఎదవ జీవితం. అటు తిప్పి ఇటు తిప్పినా ఉన్నవి నాలుగుచీరలు. అవి చీకిపోయి రంగు మాసిపోయాయి ” నిరాశగా అనుకుంది.“ రేపీ పాటికి నువ్వు ఓ పెద్ద హీరోయిన్ అవుతావ్..” చారల చొక్కా కుర్రాడు చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. బాధ మాయమైంది. మనసు ఆనందపరవశమైంది.

గబగబ ఒంటి చుట్టూ చీర కట్టుకుంది.

తమ అభిమాన హీరోయిన్ ని గుర్తుచేసుకుంది.

చీర కుచ్చిళ్లను నెమ్మదిగా కిందకు జార్చి ఉదరభాగం కనపడేలా సర్దుకుంది.

మళ్లీ అద్దంలో చూసుకుంది.

ఈ సారి సంతృప్తిగా అనిపించింది.

‘ ఎగిరిపోతే.. ఎగిరిపోతే.. ఎగిరిపోతే ఎంత బావుంటుందీ...” పాటందుకుంది.

చామంతిని గమనిస్తూనే ఉంది ఆమె తల్లి.

ఆమె నాలుగడుగుల దూరంలో గిన్నెలు తోముకుంటోంది.

కూతురిని ఓ కంట కనిపెడుతూనే ఉంది.

"తను నాలుగిళ్లలో పాచిపని చేస్తూ వచ్చే సంసారాన్ని లాగిస్తుంటే ఈ పిల్లకు సోకులు... సరదాలు "

ఎప్పటిమాదిరిగానే గొణుక్కుంది.

చామంతికి ఇవేం పట్టవు. తన ఇరుకు జీవితం అంటే రోత.

అందరి ఆడపిల్లల్లా ఉండాలనుకుంటుంది. అందంగా మేకప్ చేసుకోవాలని... ఖరీదైన బట్టలు వేసుకోవాలని...మంచి నగలు పెట్టుకోవాలని.. ఇలా ఎన్నో ఆశలు..

నిత్యం రోడ్డు మీద వచ్చేపోయే ఆడవాళ్లని గమనిస్తూంటుంది.

తన దురదృష్టానికి చింతిస్తూ ఉంటుంది.

'ఏమే.. ఎక్కడికే?' తలుపు తీసి బయటకు వెళుతున్న కూతురుని ప్రశ్నించింది తల్లి. చామంతికి జవాబు చెప్పాలనిపించలేదు. మటన్ షాపు మస్తాన్ తో సినిమాకు వెళితే తల్లి చేసిన రాద్ధాంతం ఆమెకింకా గుర్తుంది.

ఆరోజు మస్తాన్ చెవులకు జూకాలు, గొలుసులు కొని తెచ్చిచ్చాడు. అవి అచ్చు బంగారం వాటిల్లా తళతళమెరిశాయి.

తనకు బలే సంతోషం వేసింది.

ఆటోలో సినిమాకు తీసికెళ్లాడు.

అంత పెద్ద సినిమాహాలుని చూడటం అదేమొదటిసారి.

తను ఉబ్బితబ్బిబ్బవుతుంటే.. మస్తాన్ తనను ముద్దులతో ముంచెత్తాడు.

అన్ని కొనిచ్చినందుకు తనే వాడిని ముద్దాడాల్సింది.

వాడే చొరవ తీసుకుంటే... తనకు మజాగా అనిపించింది.

ఆ తర్వాత ఇద్దరూ సినిమా చూస్తే ఒట్టు.

'మళ్లీ వారం సినిమాకు వెళ్దామే' అని మస్తాన్ అన్నా...   తనకు వాడితో సరదాగా గడపాలనిపించినా..

' ఈసారి వాడూ నువ్వూ మాట్లాడుకుంటే కాళ్లిరగ్గొడతా'   తల్లి చేసిన హెచ్చరికలు గుర్తొచ్చి ఆగిపోయింది.

మస్తాన్ గాడు రెండు మూడుసార్లు పలకరించినా తను తలదించుకుని వచ్చేసింది.

ఇప్పుడు చారల చొక్కా కుర్రాడి విషయం చెబితే

'అమ్మో .. ఇంకేమయినా ఉందా?   అదేదో కొంప మునిగిపోయినట్టు శోకాలు పెడుతుంది. తను చెడిపోయానని శాపనార్థాలు

పెడుతుంది. ఇదంతా భరించటం తన వల్లకాదు.

మనసులోనే అనుకుంటూ కాలు బయటపెట్టింది చామంతి.

తను ఎలాంటి పరిస్థితులకు తను ఎదుర్కోబోతోందో ఆ నిముషాన ఆమెకు ఊహకు కూడా అందలేదు.

నాల్రోజుల క్రితం నాటి సంఘటనలు వరుసగా గుర్తొచ్చాయి.

ఆ రోజు తల్లికి జ్వరం. బయటకు రాలేని పరిస్థితి.

పనికి వెళ్లమంటూ తనను పురమాయించింది.

ఈ పనులంటే వల్లమాలిన చికాకు తనకు.

“ఆ లాయరు గారి భార్య పరమగయ్యాళి. ఓ రోజు పనికి నాగా పెట్టినా నెలజీతంలో కోతేస్తుంది. పోయిరా. ఆ పక్కన మేడ మీద రెండో ఇల్లుకూడా వెళ్లు. మిగతా వాళ్లకి నేనే ఏదో ఒకటి చెప్పుకుంటాను” అంటూ తల్లి బలవంతం చేస్తే..

కాదనలేక బయలుదేరింది.

“ అమ్మ చెప్పినట్టే లాయరు గారి భార్య గయ్యాళి.

గిన్నెలు కడిగితే జిడ్డువదల్లేదని, ఇల్లు తుడిస్తే కాఫీ మరకలు పోలేదని...

ఇలా తను చేసిన ప్రతి పనికీ వంకలు పెట్టి, అవే పనులు మళ్లీ మళ్లీ చేయించింది.

బయటకొచ్చేముందు నాలుగు ఇడ్లీలు, కాసిని కాఫీ పోసింది.

ఆ తర్వాత

'నీది బలే కళ గల మొహమే. మా అమ్మాయి పరికిణీలు ఇస్తానుండు' అంటూ పాతవి నాలుగు తీసుకొచ్చి చేతిలో పెట్టింది.

కోపాన్ని, ప్రేమని ఒకేసారి వ్యక్తం చేసిన ఆమె ప్రవర్తన చామంతికి వింతగా అనిపించింది.

ఈ పనంతా పూర్తయ్యాక డాబా ఇంటికి వెళ్లింది.

గ్రిల్ తలుపులు తెరిచే ఉన్నాయి.

ఎవరో చారల చొక్కా కుర్రాడు ముందు గదిలో టీవీ చూస్తూ కనిపించాడు.

తనొచ్చిన పని చెప్పగానే లోపలకి వదిలాడు.

గదులన్నీ చీపురుతో తుడిచిన తర్వాత బెడ్ రూంలోకి వెళ్లింది.

చూపు తిప్పుకోలేకపోయింది.

'ఇల్లే ఇంద్రభవనం అనుకుంటే... ఈ గది ఇంత గొప్పగా ఉందేమిటి?' అనుకుంది.

పేద్ద మంచం... తన జీవితంలో అంత పెద్ద మంచాన్ని చూసెరగదు. మంచం ఎదురుగా పెద్ద నిలువు టద్దం. గోడలకు రకరకాల పెయింటింగ్స్. ఎటువైపు చూడాలో అర్ధం కాక గందరగోళ పడింది.

ఆ పరుపు మీద పడుకుంటే ఎలాగుంటుందో చూడాలన్న కోరిక కలిగింది.

బలవంతంగా అణచుకుంది.

డ్రెస్సింగ్ టేబుల్ పైన రకరకాల సీసాలు... అవన్నీ మొహానికి పూసుకునే రంగులట. టీవీల్లో చాలా సార్లు చూపెట్టారు.

ఓసారి చూస్తే పోలా? అనుకుంటూ.. దగ్గరకెళ్లితో ఓ దాని మూత తీసి చూడసాగింది.

" నీకది కావాలా?" ఎవరిమాటలో వినబడి ఉలిక్కిపడి వెనక్కితిరిగిచూసింది.

చారల చొక్కా కుర్రాడు.

" అవి కావాలంటే తీసుకో " అంటూ తనకు దగ్గరగా వచ్చాడు.

తన చేతిలో ఉన్న సీసాను గబుక్కున డ్రెస్సింగ్ టేబుల్ పై నుంచి గబుక్కన బయటకు పరిగెత్తబోయింది.

ఆ కుర్రాడు వెళ్లనిస్తేనా? మధ్యలోనే అడ్డుకున్నాడు.

తన కదలికలను అతను గమనిస్తున్నాడన్న విషయం తెలిసి చామంతికి గుండె దడదడలాడింది.

ఎప్పుడెప్పుడు అక్కడ నుంచి పారిపోదామా అనిపించింది.

అతను అటూ ఇటూ కదలినవ్వలేదు.

గబుక్కున తన బాహుబంధాల్లో బిగించి ... ముఖాన్ని పెదాలతో అద్ది..

ఆ తర్వాత బలవంతంగా తన  శరీరాన్ని ఎత్తి మంచం మీదకు విసిరేశాడు.

స్వప్నలోకంలోకి పడినట్టుగా అనిపించింది ఆమెకు.

ఆ మంచం. మెత్తటి పరుపు...గాల్లో తేలుతున్నట్టుగా ఉంది.

‘ నీ అంత అందం ఎవరికీ లేదు తెలుసా... ముఖానికి మేకప్ వేస్తే ఇప్పుడున్న ఏ హీరోయిన్ నీ దరిదాపుల్లో ఉండదు ?” పొగడ్తలతో ముంచెత్తాడు.

ఏం పెట్టి పెంచావ్ ఈ శరీరాన్ని ... పుష్టిగా..

గుండ్రటి భుజాలు.. నిండైన వక్షాలు..  తెగ మత్తెక్కిచ్చేస్తోంది.

డబ్బులున్న వాళ్లు మంచి శరీరాకృతి కోసం నానా కష్టాలు పడతారు. నువ్వేంటి?”

ఇలా ఏదేదో మాట్లాడాడు.

“నువ్వు ఈ ఇంట్లో పుట్టవలసిన దానివి కాదే? అంటూ తన అందాన్ని ఊళ్లో చాలా మంది పొగిడిన వాళ్లే. ఇప్పుడు ఈ కుర్రాడి నోటి నుంచి కూడా అవే మాటలు వింటుంటే గమ్మత్తుగా అనిపించింది .

అతను తన శరీరంతో ఇష్టారాజ్యంగా ఆడుకున్నాడు.

బిర్యానీ భోజనం... చల్లని మంచినీళ్లు.. ఆ తర్వాత డ్రెస్ టేబుల్ ముందు చెల్లాచెదురుగా పడి ఉన్న మేకప్ సామాన్లు కొన్ని తీసి చేతిలో పెట్టి పంపాడు.

‘ అమ్మా.. నాన్న తిరుపతి వెళ్లారు. రెండ్రోజుల దాకా రారు. రేపు ఉదయం ఇదే సమయానికి వచ్చేసేయ్” వెళ్లే ముందు చెప్పాడు.‘ఏమయిపోయావ్? రెండ్రోజుల నుంచి ఎదురుచూస్తుంటే..” వీధిమలుపులో కనిపించి చారల చొక్కా కుర్రాడు నిలదీశాడు. రోడ్డుపక్కన మోటారు సైకిలు నిలబెట్టి పక్కగా నిలుచున్నాడు.

ఏం సమాధానం చెప్పాలో చామంతికి అర్ధం కాలేదు.

“నేను పనికి వెళతా.. నువ్వింట పట్టునే ఉండు” అని తన తల్లి మరుసటి రోజు బలవంతంగా తనను ఇంట్లో ఉంచేసింది. ఆ విషయం ఎలా చెప్పాలో అర్ధం కాక తడబడుతుంటే మళ్లీ అతనే అన్నాడు.

“ మా స్నేహితుడొకరు సినిమా తీస్తున్నాడు. కొత్త హీరోయిన్ కోసం వెతుకుతున్నాడు. నువ్వేం గుర్తొచ్చావు. పల్లెటూరు అమాయక అమ్మాయి పాత్రకి సరిగ్గా నువ్వు సరిపోతావు. అదే మాట వాడికి చెప్పాను. ”

అతని మాటలు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

“ తను హీరోయిన్ గానా? నమ్మశక్యం కాకుండా ఉందే?” అనుకుంటుంటే..

“ నువ్వేం భయపడవలసిన పనిలేదు. ఒక్కసారి వాళ్ల దగ్గరికెళితే చాలు. అంతా వాళ్లే చూసుకుంటారు.” ధైర్యం చెబుతున్నట్టుగా అన్నాడు. అదృష్టదేవత ఈ కుర్రాడి రూపంలో తలుపుతట్టిందనిపించింది చామంతికి. మౌనంగా అతను చెప్పేది వినసాగింది.

అతను జేబులో బొత్తిగొ కొన్ని నోట్లు తీసి ఆమె చేతిలో పెట్టాడు.

అవన్నీ ఐదొందల నోట్లు.. ఐదో, ఆరో ఉంటాయి. అవేమీ తను లెక్కపెట్టలేదు.

‘ ఈ డబ్బులతో మంచి చీరలు కొనుక్కోవచ్చు. బోలెడు మేకప్ సామాన్లు కొనుక్కోవచ్చు’ మనసులోనే లెక్కలేసుకోసాగింది. పట్టపగలే కలల్లోకి జారిపోయింది. తనో పెద్ద హీరోయిన్ అయిపోయినట్టు.. కారులో తిరుగుతున్నట్టు..

భవిష్యత్తులో తను గడపబోయే జీవితం ఆమెను ఊరించింది. ఊహాలోకంలో తేలియాడింది.

“ రేపు ఇదే వేళకు వచ్చెయ్యి. రాత్రి 8 గంటలకు ముంబయ్ వెళ్లాలి. అక్కడ నీ కోసం ప్రత్యేకంగా గెస్ట్ హౌస్ ఏర్పాటు చేశారు”.

ఇంకేదో అతను చెబుతున్నాడు. అవేమీ ఆమె చెవినపడలేదు.

ఈ పాడు జీవితంలో నుంచి బయటపడతానన్న విషయం ఒక్కటే ఆమె తలపుల్లో మిగిలిపోయింది.

గబగబా నాలుగు మాటలు చెప్పి మోటారు సైకిలు మీద అతను వెళ్లిపోయాడు.

“తనో పెద్ద హీరోయిన్ అయిపోయినట్టు.. కారులో తిరుగుతున్నట్టు..” ఏవేవో కలలు రాత్రి నిద్రపోతున్నప్పుడే కాదు. మెలకువలోనూ ఉక్కిరిబిక్కిరి చేశాయి.

అందుకే తల్లితో ఒక్క మాటయినా చెప్పకుండా

ఆమె గుమ్మం దాటింది.

చారల చొక్కా కుర్రాడితో రైలెక్కేసింది.

రైలుపరిగెడుతుంటే ఆమెలో ఉత్సాహం పరుగులు పెట్టింది.

'ఎగిరిపోతే.. ఎగిరిపోతే.. ఎగిరిపోతే ఎంత బావుంటుంది'

ఉల్లాసంగా కూనిరాగం తీయటం ప్రారంభించింది.

ఆమె ఎదురుగా కూర్చున్న చారల చొక్కా కుర్రాడు ఎవరితోనో ఫోన్లో బేరాలాడుతున్నాడు.

తను మాటలు పక్కనున్న వాళ్లెవరికీ వినపడకూడదన్న జాగ్రత్త అతనిలో కనిపిస్తోంది.

"కొత్త పిట్ట. చాలా ఫ్రెష్ గురూ... రేపు సాయంత్రం రైల్వే స్టేషన్ దగ్గరికొచ్చెసేయ్. అమ్మాయిని నీకు హేండోవర్ చేస్తాను."

తన బ్యాంకు ఖాతాలో ఎంత డబ్బులు వేయాలో చెప్పాడు.

దానికి అవతల వ్యక్తి అభ్యంతరం చెప్పినట్టున్నాడు.

" అదేం కుదర్దు. పైసా తగ్గినా ఒప్పుకోను". కరాఖండీగా చెప్పాడు.

మళ్లీ అవతల వ్యక్తి ఏదో అన్నాడు.

" నువ్వు చెప్పిన రేటుకి ఇంత కష్టపడి ముంబయ్ దాకా రావలసిన పనిలేదు.

హైదరాబాద్ లోనే నా పనయిపోతుంది. " అని.. " నీకిష్టం లేకపోతే చెప్పు. మొన్నామధ్య ముస్తఫా ఓ నలుగురయిదుగురు కావాలని

అడిగాడు. అతనికి పంపేస్తాను" గట్టిగా చెప్పాడు.

ముస్తఫా ముంబయ్ రెడ్ లైట్ ఏరియాకు అమ్మాయిలను సరఫరా చేసే బ్రోకరు. రాజకీయ నాయకులు, పోలీసులతో అతనికి బాగా పరిచయాలున్నాయి. అండర్ వరల్డ్ తో కూడా సంబంధాలున్నాయంటారు.

ముస్తఫా పేరు చెప్పగానే అవతల వ్యక్తి దిగొచ్చాడు.

" సరే. డీల్ ఓకే .. నువ్వు చెప్పిన రేటు ఇచ్చేస్తా..." అని ఓ నిముషం ఆగి

" అన్నట్టు అరబ్ షేక్ ఒకతను ఆ మధ్య హైదరాబాద్ అమ్మాయిలను చూశాడట. మనసు పడ్డాడు.

అక్కడ అమ్మాయిలు బావుంటారు. కనీసం ఓ ముగ్గురయినా కావాలి అనడిగాడు. ఒకర్నయినా నువ్వు చూసి పెట్టాలి."చారల చొక్కా కుర్రాడు జవాబు చెప్పలేదు. అవతల వ్యక్తి చెబుతున్నది శ్రద్ధగా వింటున్నాడు.

"డబ్బులు గురించి నువ్వేం ఫికర్ చెయ్యకు. మనం అడిగినంత ఇస్తాడు. ఓకేనా..." అడిగాడు.

చారల చొక్కా కుర్రాడు చుట్టూ ఉన్న వ్యక్తులను పరిశీలించసాగాడు.

అతని చూపులు ఎదురుగా పైబెర్తుపై పడుకుని ఇంగ్లీషు నవల చదువుకుంటున్న అమ్మాయిపైన నిలిచిపోయాయి.ఆమె ఒంటరిగా రైలెక్కిన విషయాన్ని అతను గ్రహించాడు.

ఆమె వేషధారణ,తీరు చూసి బహుశా ఏ సాఫ్ట్ వేర్ ఉద్యోగో అయ్యుంటుందని అనిపించింది.

ముంబయ్ వెళ్లే లోపు ఆమెను ఎలాగయినా తన దారికి తెచ్చుకోగలనన్న నమ్మకం కలిగింది.

“ నీ పని అయిపోయినట్టే. డబ్బులు సిద్ధం చెయ్యి” అవతల వ్యక్తికి ఫోన్లో చెప్పి

ఆ అమ్మాయినే చూస్తూ ...

మనసులో తనకు రాబోయే డబ్బుల గురించి లెక్కలు వేసుకోసాగాడు చారలచొక్కా కుర్రాడు.



ఆమాల్ కు చాలా నెర్వస్ గా వుంది. జీవితంలో యింత టెన్షన్ ఎప్పుడూ అనుభవించ లేదు. టెన్త్ పరీక్షలు రాసి కూల్ గా అమ్మమ్మ వాళ్ళ వూరు వెళ్లి కజిన్స్ తో ఫుల్ గా ఎంజాయ్ చేసొచ్చాడు. ఇంటర్, ఎంసెట్, ఐ ఐ టి పరీక్షలన్ని ముగించి ఢిల్లీ లో వున్న మామయ్య వాళ్ళింట్లో వుండి ఇండోర్, ఔట్డోర్ గేమ్స్ తో పాటు సినిమాలు, షికార్లు చేసి,రిసల్ట్ గురించి ఒక్క సారి కూడా ఆలోచన చేయలేదు, ఐ ఐ టి చెన్నై లో సీట్ వచ్చాక నాలుగేళ్ళలో చదువు కూడా ఏనాడు ఇబ్బంది పెట్టలా! వుద్యోగం వెంట పడి వచ్చింది ....ఆపై.వుద్యోగం లో కూడా చెప్పుకోదగ్గ సమస్య లేదు...నాలుగేళ్ళలో రెండు ప్రమోషన్లతో...మంచి జీతం తో చాలా కంఫర్టబుల్ గా వున్నాడు ....ఏ రకమైన వత్తిళ్ళు లేని అతని జీవితం లోకి ...ఈ తన్వి వచ్చి ఆమాల్ ను కష్టాల సుడిగుండం లోకి నెట్టింది. కాలేజ్ లో స్నేహితులంతా ప్రేమలో పడి కొట్టుమిట్టాడుతుంటే ఆమాల్ నవ్వుకునే వాడు . ప్రియురాళ్ళ ముచ్చట్లు తీర్చలేక అప్పుల పాలయ్యే స్నేహితులకు కొంతలో కొంత సహాయం చేసి...ఆపై ఎంత హితబోధ చేసినా...మారని స్నేహితుల్ని చూసి జాలి పడే వాడు. అమ్మాయిల వెంట తిరుగుతూ చదువు ఎత్తిపెట్టి పేపర్లన్నీ పెండింగులో పెట్టె వాళ్ళను తిట్టేవాడు...'నీకూ మాలా బాధలు కలుగుకాక' అని చాలా మంది శపించినా, ఆమాల్ కు అంట్లాంటి వికారం కలగనే లేదు. స్నేహితులంతా పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారని ...నీ సంగతేంటని అమ్మా నాన్న అడిగితే ఆలోచనలలో పడ్డాడు అమాల్.

జీవిత భాగస్వామి పై అతనికి కొన్ని నిర్దుష్టమైన అభిప్రాయాలు వున్నాయి.బాపు బొమ్మలా కాకపోయినా బాపు సినిమాలో హీరోయిన్ లా నిండుగా వుండి, బారెడు వాలుజడ ఖచ్చితంగా వుండాలని ,జీరో సైజ్ అంటూ ఎముకల గూడులా కాకుండా చబ్బి చీక్స్ తో పాటు డింపుల్ చిన్ కాకపోయినా బుగ్గ మీద మాత్రం నవ్వితే సొట్ట పడాలని ఎప్పుడో నాన్న చూస్తున్న 'అనుపమ' సినిమా లో షర్మిలా టాగోర్ ని చూసి నిర్ణయించుకున్నాడు. అతని క్లాసు మేట్స్ లో ఆ లక్షణాలు వున్నాయో లేవో అతను గమనించనే లేదు. అతని ధ్యాసంతా చదువు పైనే వుండేది , అమ్మాయిలతో మాట్లాడినా అతనికి పెద్ద జెండర్ ఫీలింగ్ వుండేది కాదు. చదువుకు సంబంధించిన డిస్కషన్ కు అతను అమ్మాయిల్ని అబ్బాయిల్ని ఒకేలాచూడటం అతనికి 'ఐ ఐ టి' నేర్పిస్తే, అమ్మాయిల్ని గౌరవంగా చూడటం, అతి చనువు ప్రదర్శించకుండా వుండడం అతని కుటుంబం నేర్పింది. అమాల్ కు తనకు కావాల్సిన లక్షణాలు వున్న అమ్మాయి ఎక్కడా కనపడలా! తనతో పాటు పని చేసే వాళ్ళలో చీర తో అటుంచి చుడిదార్ వేసుకునే వాళ్ళేలేరు. అమాల్ అతని అమ్మలా, వదినలా భారతీయత కల్గిన స్త్రీ కోసం వెతికి వెతికి దిగులు పడిపోయాడు. తనకు నచ్చిన తర్వాత, పరిచయం చేసుకుని ..అభి ప్రాయాలు తెలుసుకుని తర్వాత ప్రపోస్ చేసి, ఆమె అమ్మ నాన్నలకు, ఇతని అమ్మ నాన్నలకు తెలియ చేసి, ఆ తర్వాత ప్రేమ లేఖలు లాంటి మేసెజ్ లు ఇచ్చుకుని, విరహం లాంటి ఫీలింగ్స్ ని ఎంజాయ్ చేసి, కొంత కాలం తర్వాత పెళ్లి చేసుకోవాలనే అతని వూహా ఊహగానే ఉండిపోయింది. చేసేదిలేక ఇక అన్న వదిన, అమ్మానాన్నలకే అమ్మాయిని వెతికే పని అప్పచెప్పాడు.

ఈలోగా ప్రాజెక్ట్ వర్క్ కోసం రెండు నెలలు చికాగో వెళ్ళాల్సి వచ్చింది. అప్పుడే అతని వదిన సుజన అనే అమ్మాయి ఫోటో నెట్ లో పంపారు.అమ్మాయి బావుంది కాని బాపు హీరోయిన్ లా లేదు ...చుడిదార్ వేసుకున్నా ఆ హెయిర్ స్టైల్ చూడగానే జీన్స్ లో వుంటుంది, పెళ్లి చూపుల ఫోటో కి అలా తీసి పంపారు అనిపించింది. వదిన రమ తో ఆ మాట అంటే,

"ఇంక ముత్యాల ముగ్గు హీరోయిన్ సంగీతకు కూతురుందేమో చూద్దాం. పెళ్లి పుస్తకం హీరోయిన్ దివ్యవాణికి, ఆమనికి, స్నేహ కు

కూడా పెళ్ళైపోయింది, .ఇంకా బాపు శ్రీ రామరాజ్యం హీరోయిన్ నయన తార , ప్రభుదేవాను వదిలేసింది ,.ఇంకా చార్మికూడా బాపు హీరోయిన్ ట్రై చేద్దామా నీ వయసే " అంది.

"వద్దు బాబోయ్....ఆ నయనతార .... చార్మి..వద్దు వద్దు" అన్నాడు.

"బాపు గారి సినిమాలో మేకప్ లో అలా వుంటారు,ఈ అమ్మాయి ని నీకిష్టం మైనట్లు మలుచుకోవచ్చు కదా"అంది.

ఏదో అసంతృప్తి వెంటాడినా ..నా ఇష్టాలు తెలిసిన వాళ్ళే కదా నాకు నచ్చేట్టు ఉంటేనే కదా వీళ్ళు కూడా ఒప్పుకునేది అనిసరి పెట్టుకున్నాడు.

మళ్ళీ "నేను వచ్చి చూసాక చెబుదాం" అన్నాడు

"నీవు వచ్చే వరకు ఆగమంటే ఎలా ? నచ్చింది కదా మళ్ళీ రెండు నెలలవరకు వాళ్లకు ఏమీ చెప్పక పోతే ఎలా? ఓకే చెప్పేద్దాము, నీకు తప్పకుండా నచ్చుతుంది ...కావాలంటే సుజన తో మాట్లాడు" కోప్పడింది వదిన.

ఆమాల్ కు సుజన తో మాట్లాడి నప్పుడు కూడా ఏదోలా అనిపించింది. అప్పుడప్పుడు ఫోన్ చేస్తే బాగానే మాట్లాడింది.కొంచం కొంచం ఇష్టం అయ్యింది సుజన అంటే, ఎంతయినా కాబోయే భార్యకదా ఫీలింగ్స్ తెచ్చుకోవాలి అనుకున్నాడు.

"సుజన ఎలా వుంది?" అడిగాడు వదినతో.

"ఇంప్రూవ్ అయావు.. ఎయిర్ పోర్ట్ కి తీసుకురానా ?"అంది.

"వస్తుందా!" "ఆశగా అన్నాడు.

" ట్రై చేస్తా.. మీ అన్నయ్య తో నేను వస్తే తీసుకు వస్తా .."అంది.

కాని ఎయిర్ పోర్ట్ కి ఆమాల్ అన్నయ్య ఒక్కడే రావడం తో ఆమాల్ కాస్త నిరాశ పడ్డాడు.

కార్ దిగి లగేజ్ సంగతి కూడా చూడకుండా ఆమాల్ ఇంట్లోకి పరుగు తీసాడు అమ్మని చూడక ఎంతో కాలమైనట్లుంది. ఎదురుగా వస్తున్న అమ్మాయి కి డీ కొట్టాడు ..తల పట్టుకున్న అమ్మాయి కోపంగా చూసింది ఆ తర్వాత ఆమాల్ ఆ ఇంటి అబ్బాయే అనుకుని సారీ చెప్పి మెల్లిగా ప్రక్కకు తప్పుకుని వెళ్లి పోయింది. ఒక్క క్షణంలో ఆమాల్ కు తల తిరిగింది. డీ కొట్టడం వలన కాదు ...తన ఊహల ఊర్వశిని క్షణంలో వెయ్యోవంతులో గుర్తు పట్టాడు .ఒక వేళ ఈమే సుజన కాదుకదా ... వుహూ ..ఆ పెద్ద జడ ..ఆ గుండ్రటి ముఖం ఆ పెద్ద బొట్టు, నవ్వలేదే... నవ్వితే బుగ్గలపై డింపుల్ పడుతుందా! చుట్టూ అందరూ చేరి కబుర్లు మొదలెట్టినా ఆమాల్ గుండె వాలుజడ చిన్న దానితో వెళ్లి పోయి, అన్య మనస్కంగానే వున్నాడు. సుజన చర్చ రానే లేదు,వదిన ను ఆ అమ్మాయి ఎవరో అడుగు దామని అనుకున్నాడు కాని రమ ఒంటరిగా దొరక లేదు.

అమ్మ వొడిలో పడుకుని ముచ్చట్లు చెబుతున్న ఆమాల్..".రమక్క లేరా ఆంటీ ?" అని సంశయంగా ఆగిన ఆ అమ్మాయిని చూసి గబాల్న కూర్చున్నాడు.

"ఈ అమ్మాయి రమ కు డిస్టంట్ కజిన్, తన్వి, మైక్రోబయాలజీ లో PhD చేస్తోంది, మా అబ్బాయి ఆమాల్ బెంగుళూర్ లో జాబ్ చేస్తాడు " తల్లి పరిచయం చేయడంతో

"హలో"అన్నాడు.

"హలో "..అని డీ కొట్టింది గుర్తు వచ్చి కాబోలు నవ్వింది.

హిప్ .హిప్ హుర్రే అని గట్టిగా అరవ బోయి తమాయించుకున్నాడు. నవ్వగానే ఆమె ఎడమ బుగ్గపై పడిన డింపుల్ అతన్ని ఆకాశం లో విహరింపచేసి, ఈ మగువ సుజన కాదు అన్న తలపు దబాల్న భూమ్మీద వచ్చి పడేసింది.

రమ, తన్వి గొంతు విని గది లోపలి నుండే, "రా లోపలి, నోట్స్ రాస్తున్నా "అంది .'ఎక్స్క్యూజ్ మీ" అని లోపలి వెళ్ళింది తన్వి.

లోపలి నుండి ఒకటే నవ్వులు .సుజన ను తీసుకొస్తానని చెప్పిన వదిన ఆ ఊసే తేలేదేమిటి అనుకున్నాడు. ఆమాల్ కు ప్రపంచమంతా తన్విలా అనిపించసాగింది. దేని మీద ధ్యాస కలగలా! వదిన తన్విని అలా గదిలోనే ఉంచేయడం నచ్చలేదు , తన్వి బయటికి వస్తుందేమోనని అతని కళ్ళు రమ గది కేసి చూస్తూండిపోయాయి.అతనికి అర్థమైంది ప్రేమ అంటే ఎలావుంటుందో ! స్నేహితుల శాపాలు ఫలించాయి. తొలి చూపులో ప్రేమ లో పడ్డం సాధ్యమా! అనుకునే వాడు ఏదీ తన వరకు వస్తే గాని అర్థం కాదు. ఇపుడు అర్థమైంది ప్రేమంటే ! మనసంతా ఆమే! ఆలోచనలన్నీ ఆమె గురించే ...తన్వి ఎంత మంచిపేరు ! కానీ సుజన తో పెళ్లి కి వొప్పుకున్నాడే ...ఇప్పుడు ఇంకో నచ్చిన అమ్మాయి కనపడిందని, మాట ఇచ్చిన అమ్మాయికి మోసం చేయడం తగునా! మధన పడుతున్నాడు ఆమాల్.

బోజనానికి తన్వి కూడా కూర్చుంది ఆమాల్ కి ఎదురుగా. రమ ఆమాల్ ఫీలింగ్స్ కనిపెట్టింది... ఏదో తేడాగా వున్నాడనుకుంది. "తన్వి... మా ఆమాల్ ఇంకో వారం ఉంటాడు పాపం ఎవరూ స్నేహితులు లేరు, నేను మీ బావ కాలేజ్ కి పోతే మామ గారు ఆఫీసుకు వెళితే అత్తయ్య ఒక్కటే వుంటారు, ఎలాగూ నీవు కూడా ఉంటావుగా ఇంకో వారం, కొంచం కంపెని ఇవ్వు"

"ష్యూర్ అక్కా" అంది కాని తన్వి పెద్దగా మాట్లాడ లేదు.

రమ తీరిగ్గా వుండగా "సుజన రాలేదా మీరు చెప్పారుగా నేను వస్తున్నానని ..తను రాలేదేం ?" అన్నాడు."ఓహ్ మర్చిపోయా! తను వూర్లో లేదు ఏదో మారేజ్ కి వెళ్ళింది. రాగానే కాల్ చేస్తానన్నది. అంది."

తన్వి, రమ,క్యారమ్స్ ఆడ దామన్నారు, ఆమాల్ అమ్మగారుకూడా ఓకే అన్నారు. ఆమాల్ ని కూడా ఆడమన్నారు. తన్వి ఆమాల్ ఒక జట్టు, రమ, అమ్మగారు ఒక జట్టు ...ఎప్పుడూ వోడిపోయే ఆమాల్ విజ్రంభించి ఆడాడు. తన్వి కూడా కమాన్ ఆమాల్ బ్లాక్ వెయ్యి, రెడ్ వెయ్యి అంటుంటే వేసేయ్య గలిగాడు. అతనికి తన్వి మాట వేదంగా అనిపించింది. జీవితం అంతా క్యారమ్స్ గేం ఆడుతూ ..తన్విని చూస్తూ గడిచిపోతే చాలనిపించింది ఆమాల్ కు. వారం గడిచి పోయింది. తన్వి హైదరాబాద్ వెళుతున్నానని చెప్పింది ..ఇంట్లో అందరూ తన్వి ని ఇష్టపడతారు అందరితో సరదాగా వుంటుంది.ఆమాల్ కి కూడా జాయినింగ్ టైం అయిపోతోంది ..ఆమె అంటే ఇష్టమని తన్వి తో చెప్పెయ్యాలి...అనుకున్నాడు. కానీ సుజన.. ? తను చూడని, కలవని అమ్మాయి కోసం తన కలల కన్యను వదులు కోవడమా! ధర్మ సందేహం ఒక ప్రక్క, ప్రేమించిన అమ్మాయికి ప్రేమ వ్యక్త పరచలేని నిస్సహాయత ఒక ప్రక్క ...సంఘర్షణ, అనిశ్చిత స్థితిలో...మరీ ఆలోచించడానికికూడా సమయం లేదు .... తన్వి రేపు వెళ్లి పోతుంది.ఇవాళ చెప్పలేక పోతే ..ఇంక అంతే ఫోన్ లో ఆమెకు ఆన్ని వివరాలు చెప్పడం, ప్రపోస్ చెయ్యడం అబ్సర్డ్ గా ఉంటుందేమో కూడా ...! ధైర్యే ....సాహసే...తన్వి అనుకున్నాడు.

"మీతో మాట్లాడాలి" ...రమ లేనప్పుడు అన్నాడు.

"చెప్పండి " అంది.

"ప్లీజ్ ఇక్కడ కాదు బయట"

తన్వి బెదురు కళ్ళతో "ఎందుకు?" అంది.

అది చూసి అంత టెన్షన్ లోను నవ్వు వచ్చింది ఆమాల్ కు, "మరేం లేదు..ప్లీజ్..కంగారుపడకండి, మిమ్మల్ని డ్రాప్ చేయమని అడగండి " అన్నాడు.

తల ఊపింది తన్వి ... ఉత్సాహంగా వెళ్లి తయారయ్యి వచ్చాడు."వెళ్లొస్తాను అక్కా....ఆంటీ రేపు మార్నింగ్ వెళుతున్నా హైదరాబాద్ కి ,ఆమాల్ సీ యు,బాయ్ "అంది.అందరూ వీడుకోలు పలికారు రోజా ఆమె నడిచే వెళుతుంది, వాళ్ళ ఇల్లు దగ్గరే కాబట్టి. కానీ తన్వి డ్రాప్ చేయమని అడగ లేదు.

కాసేపు తటపటాయించి "..తన్వి నేను బయటికి వెళుతున్నా వుండు డ్రాప్ చేస్తా" అన్నాడు.

రోజా బైక్ లో బయటికి వెళ్ళే ఆమాల్ కార్ తీసి డోర్ తీసి పెట్టి తన్వి కూర్చున్నాక వెళ్లి డ్రైవింగ్ సీట్ లో కూర్చున్నాడు. నవ్వుతూ చూస్తున్న వదిన్ని చూసి కొంచం బెదిరాడు. కార్ ను వూరికి దూరంగా వున్న పురాతన ఆలయం దగ్గర ఆపాడు.

"మీరు నాస్తికులని చెప్పింది అక్క" అంది తన్వి.

"గుడికి భక్తులే రానక్కర లేదు ..నాకీ కోవెల చాలా ఇష్టం ఆ ప్రక్కనే లోటస్ పాండ్ వుంటుంది మా నాన్న చిన్నప్పుడు ఇక్కడికి తీసుకోచ్చేవాడు."

"ఆహా ..చాలా బావుంది నేను క్రొత్త కదా ఈ వూరికి .. చెప్పండి..ఏదో మాట్లాడాలన్నారు!."మౌనంగా వున్న ఆమాల్ ని చూసి తన్వికి కూడా ఎమీతోచలేదు. టెన్షన్ తో అతనికి చమటలు పట్టాయి.ఆమాల్ పడే టెన్షన్, తనతో ప్రత్యేకంగా మాట్లాడాలంటే అతను ప్రపోజ్ చేసేదానికే అని అర్ధమైంది తన్వికి. ఆమాల్ లాంటి అందగాడు,మంచి జాబ్ లోవున్నవాడు,'చాలా మంచివాడు' అన్న ట్యాగ్ వున్నవాడు ...కానీ అతనికి పెళ్లి ఫిక్స్ అయినట్లు చెప్పినట్టు అమ్మ చెప్పిందే మరి ..రమక్క మాత్రం చెప్పలేదు కాని మరి మరి.. ఆలోచనలలో పడింది తన్వి.

నేలపై నున్నగడ్డిపరకల్ని లాగుతున్న ఆమె చేతివేళ్లు చూసాడుఆమాల్. గోర్లు పెంచని, నాజూకైన ఆ వేళ్ళకు నైల్పాలిష్ కూడా లేదు..అతనికి గోర్లు పెంచుకోవడం అంటే ఇష్టం లేదు, లేత గులాబి రంగు చుడిదార్ లో ఆమె పచ్చటి ఛాయ మెరిసిపోతోంది.. ముందు ఆమె మనసులో ఎవరూ లేరని తెలిస్తే అప్పుడు తన ప్రేమను తెలపొచ్చు, తొందర పడరాదు అనుకున్నాడు.

"తన్వి మీరు ఎవరి నైనా ప్రేమించారా? "

"లేదు, ఎందుకలా అడిగారు?"

"యింత అందమైన మిమ్మల్ని ఎవరూ ప్రపోజ్ చేయలేదా "

"నేనెవ్వరిని ఇష్టపడలేదు "

"ఎందుకు?"

"నాక్కొన్ని ప్రిన్సిపుల్స్ వున్నాయి, వాటిని అంగీక రించే వ్యక్తి నాకు కనపడలేదు"

"ఎలాంటివి ?"

"ఖచ్చితంగా..ఇవని ..చెప్పలేను"

"నేను చికాగోలో వుండగా ఒకమ్మాయి ఫోటో వదిన పంపారు ..నాకు నచ్చిన అమ్మాయి దొరకక వీళ్ళ నిర్ణయానికే వదిలేసాను ఆ అమ్మాయి పేరు సుజన, వదిన ఫ్రెండ్ చెల్లలే అట, ఫోటో చూసి ఓకే అన్నా, రెండు సార్లు ఫోన్లో మాట్లాడా ..కానీ ...మిమ్మల్ని చూడగానే నేనుకోరుకున్న స్త్రీ మీరే అనిపించింది ..మీ రంటే నాకు ..చాలా ఇష్టం... ..మీకు ఇష్టమైతే, నేను వదినకు అమ్మా నాన్నకు చెబుతాను...సుజన తో జీవితం ఊహించుకోలేకపోతున్నా ...ఇందులో మిమ్మల్ని నొప్పించే విషయం ఏమైనా వుంటే సారీ ..." "నేనంటే ఎందుకిష్టం ?" విప్పారిన కళ్ళను మరింత పెద్దవిగా చేస్తూ అంది

"మీరు కోప్పడకూడదు..."

"వుహూ "..నవ్వునాపుకుంటూ అంది

"మీ పెద్ద జడ, నవ్వితే పడే డింపుల్ ..మొత్తంగా మీరు నచ్చారు నా ఊహల్లో వున్న రూపం మీరు "

"నాక్కూడా మీరు ఇష్టం...కానీ మా అమ్మ మీకు త్వరలో పెళ్లి అంటే నేనేమి ఆ దృష్టి లో చూడలేదు..రమక్కమీ గురించి చెప్పినప్పుడు ..మీ ఆలోచనలు ,అమాయకత్వం చెప్పినప్పుడు , మిమ్మల్ని మిస్ అయ్యాను అనుకున్నా...నేను కూడా మీలాంటి వ్యక్తినే

కోరుకున్నా.. ఆకర్షణలకు, డబ్బు, హోదాలకు కాక నాలాంటి సామాన్యమైన వ్యక్తిని మీరు ఇష్టపడు తున్నా రంటే ...అది నా అదృష్టం ." "అయితే..నేను మీకు ఐ లవ్ యు చెప్పొచ్చా.... ?"

రెండు చేతుల్లో ముఖం దాచుకుంది ...తన్వి ..ఆ సిగ్గు తెరలలో ఆమెను చూస్తూ ... "ఇ లవ్ యు.."అన్నాడు.జీవితంలో మొట్టమొదటి సారిగా ఆ వాక్యాన్ని పలకడానికి అతని హృదయం ఉప్పొంగిపోయింది. తొలి ప్రేమ జ్వరం లాంటిది అన్నాడొక కవి ...ఆ జ్వరం నూటయిదు డిగ్రీలతో తాకింది ఆమాల్ కు.

జరిగినదంతా చెప్పాడు వదినతో ...

"అయితే సుజనను ఏంచేద్దాం ?" అంది కోపంగా

"తన్వి మీ చెల్లెలేగా... చూసారుగా...ఆమె ఫోటో పంపకుండా ఇంకెవరో సుజన ఫోటో ఎందుకు పంపారు?" ..

"సుజన కంటే తన్వి బాగుందా!..."

"చాలా.... అచ్చు నా ఊహల ఊర్వసి...వదినా... ప్లీజ్ ఎలాగోలా నాకు తన్వి తో పెళ్లి జరిపించు....కావాలంటే ఆ సుజనకు మంచి వరుడ్ని చూద్దాం "

"ముందు చూడు, కట్నం వగైరా నువ్వే ఇవ్వు ..పెళ్లి కూడా జరిపించు ...తర్వాత మీ పెళ్లి సంగతి చూద్దాం .."

"ప్లీజ్ వదినా నాన్నకు తెలిసిందంటే నా మెడలు వంచి సుజన తోనే పెళ్లి జరిపిస్తాడు..."

"మరి నాకేంటి లాభం ?"

"అంటే ..లాభం కోసం ..."

" అవునయ్యా .....లాభం లేనిదే నేనెందుకు రిస్క్ తీసుకోవాలి ?"

"సరే చెప్పండి ...."

"నాకు డైమండ్ సెట్ కావాలి..పెళ్లి లో మా అమ్మావాళ్ళు పెట్టలేదు ,మీ వాళ్ళు పెట్టలేదు .. మీ అన్నను సాధిస్తే డైమండ్ సెట్ సంగతి తెస్తే కాశికి వెళ్లి సన్యాసం స్వీకరిస్తానని బెదిరిస్తున్నాడు ఇంక ఇప్పుడు నీవు తెచ్చిస్తానంటే ఆ రిస్కేదో తీసుకుని ఆ ముచ్చట తీర్చు కుంటా. " "వదినా జోక్స్ వేయకండి ...ప్లీజ్ .."

"ఓకే...ఓకే ...సుజనని మన దారి లోంచి తప్పించాలి... తన్విని సీన్ లోకి తేవాలి అంతేనా ...ఒక పని చేద్దాం ...సుజన భర్తకి చెప్పేద్దాం ...""సుజన భర్త ఏంటి .... ? " కంగారుగా అన్నాడు.

"లక్కీ ఫెలో ...సుజనకు పెళ్లి అయిపోయింది ...నీవు వచ్చే రోజే...ఎన్నాళ్ళు గానో ఆ అమ్మాయిని ఇష్ట పడ్డబ్బాయి, నీతో పెళ్లి ఫిక్స్ అయిందనగానే వచ్చి ఏడ్చాడట ..ఆ అబ్బాయి అంటే సుజన కు కూడాఇష్టమట... వచ్చి నాకు చెప్పింది... ఏమి చేయను ? అలాంటి అమ్మాయిని చూసావేంటి అని అందరూ అడుగుతారని హడలి చస్తున్నా ...ఇంతలోనే తన్వి వాళ్ళు ట్రాన్స్ఫర్ మీద రావడం తో తన్వి ని నిజానికి నీకు చూడాలని అనుకుంటున్నా, అయితే సుజన సంగతి నీవు పదే పదే అడిగాక..కొంచం కంగారు పడ్డా !..బ్రతికించావు బాబు...తన్విని ఇష్ట పడి, లేక పోతే,అందరితో ఆశ్చింతలు, మీ అన్న తో నాకుండేవి అంతం లేని సొంత బాణీలు .."

"తన్వి సంగతి తర్వాత ... ముందు సుజన సంగతి చెప్పకుండా ఉండడానికి ముందు నాకు షరతులున్నాయి .."

"అదేంటి..."

"మీరు మా హానీమూన్ ఖర్చు భరిస్తానంటేనే... ఈ విషయం అన్న వరకు పోకుండా వుంటుంది ..."

"అమ్మో అమ్మో ఇవి నీ తెలివితేటలు కాదు "

"అవును ... మీవే....మిమ్మల్ని చూసి నేర్చుకున్నా... "

గట్టిగా నవ్వుకుంటున్న వదిన మరిదిని చూసి...లోపలి వచ్చిన అత్త మామల్ని చూసి రమ నవ్వాపింది. నవ్వుకుంటూ వాళ్ళమ్మను నీకో విషయం చెప్పాలంటూ పక్కకు తీసికెళ్ళా డు ఆమాల్